RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

హైదరాబాద్ | 12 మార్చ్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:238

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake
Printing of
Daily News Papers

# తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**శివ ప్రతాప్ శుక్లాతో గవర్నర్ గా ప్రమాణస్వీకారం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్.**

హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ తెలంగాణా గవర్నర్‌గా పదవీ బాధ్యతలు వినమ్రతతో, గౌరవ భావంతో స్వీకరిస్తూఇది నాకు గొప్ప సత్కారంగా భావిస్తున్నాను.

నాపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన భారత రాష్ట్రపతి, భారత ప్రధాన మంత్రి కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.





తెలంగాణా ప్రజలకు సేవ చేయడం గర్వంగా, అదృష్టంగా భావిస్తున్నాను.

తెలంగాణ రాష్ట్రం అంటే సాంస్కృతిక సంపద, గొప్ప సంప్రదాయాలు, అసాధారణ పురోగతికి నిదర్శనం.నేను హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా పని చేసిన అనుభవం తెలంగాణ రాష్ట్రానికి ఉపయోగ పడుతుందని భావిస్తున్నాను. తెలంగాణ ప్రాంతం ఆశలు, ఆవిష్కరణలు, సహనశక్తికి చిహ్నంగా నిలుస్తుంది.

ప్రజల అకుంఠిత దీక్ష, రాష్ట్రంలోని సమృద్ధ వనరులు, వ్యూహాత్మక దృష్టి, సమగ్ర అభివృద్ధికి, స్థిరమైన ప్రగతికి బలమైన ప్రాతిపదికను అందిస్తాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఉన్న తెలంగాణా ప్రభుత్వానికి, కేబినెట్ సభ్యులకు నా హృదయపూర్వక అభినందనలు.

మనమందరం కలిసి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ లక్ష్యాలను గౌరవిస్తూ ముందుకు సాగుదామని విశ్వసిస్తున్నాను. తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా, నేను సమగ్రత, సమైక్యత, సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంటాను.నా విధులను న్యాయబద్ధంగా, నిజాయితీగా, భారత రాజ్యాంగానికి అనుగుణంగా అంకితభావంతో నిర్వహిస్తాను.

మనమందరం సమిష్టిగా సుసంపన్నమైన తెలంగాణా రాష్ట్రాన్ని నిర్మించడానికి కలిసి పని చేద్దాం.

# దానం, కడియం లకు క్లీన్ చిట్



హైదరాబాద్ పార్టీ పిరాయింపు కేసులు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలని స్పీకర్ గడ్డం ప్రసాద కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తుది తీర్పు ప్రకటించారు. ఎనమిది మంది ఎమ్మెల్యేల తరహాలో దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు క్లీన్ చిట్ ఇచ్చారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసారు. వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, కూతురు కడియం క్యావ్యకు మద్దతుగా కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేసారు.

# పశ్చిమాసియా యుద్ధంపై మోదీ కీలక వ్యాఖ్యలు



ఖమ్మం, మార్చి 11 ఎన్నికల ప్రచారంలో భాగంగా కేరళలోని ఎర్నాకుళంలో పర్యటించిన ప్రధాని మోదీ పశ్చిమాసియా యుద్ధంపై మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతీయులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. భారతీయులు అక్కడ చిక్కుకోవాలని కాంగ్రెస్ కాంక్షిస్తోందని.. కాంగ్రెస్ యువరాజు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.కేరళ ఎర్నాకుళం సభలో కాంగ్రెస్పై నిప్పులు చెరిగారు ప్రధాని మోదీ. పశ్చిమాసియా యుద్ధంపై మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధంతో లక్షలాదిమంది భారతీయులు చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటునట్టు తెలిపారు. భారతీయులు అక్కడ చిక్కుకోవాలని కాంగ్రెస్ కాంక్షిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు మోదీ. యుద్ధం పేరుతో తనను తిట్టడమే పనిగా కాంగ్రెస్ నేతలు పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధాన్ని కూడా కాంగ్రెస్ తన స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుంటోందని మండిపడ్డారు .గల్ఫ్ యుద్ధం అందరికి మరో గుణపాఠం నేర్పిందన్నారు ప్రధాని మోదీ. ఇంధన రంగంలో ఆత్మనిర్భరతకు కృషి చేస్తుందన్నారు. బీజేపీకి అవకాశం ఇస్తే కేరళను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ క్రమంలోనే రాహుల్గాంధీపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. దేశ యువతపై రాహుల్గాంధీకి ఎలాంటి అవగాహన లేదని విమర్శించారు. కేరళ యువత డ్రోన్లను తయారు చేస్తున్న విషయంపై రాహుల్గాంధీకి ఇప్పటికి కూడా అవగాహన లేదన్నారు. భారత అభివృద్ధిని చూసి కాంగ్రెస్ యువరాజు తట్టుకోలేకపోతున్నారని మిర్శించారు.

## ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లకు ప్రణాళికలు

వార్తా 2 లో

# అన్న మాట ప్రకారం.. 15 రోజుల్లోనే!

**డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మలతో కలిసి వెలుగుమట్ల నిర్వాసితులకు పట్టాల పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి**

**కబోదుల పాలనలో పేదోడి ఘోష.. ఇందిరమ్మ రాజ్యంలో పట్టాల పండుగ**

**కూల్చినోళ్లే నీతులు చెబుతారా?.. విపక్ష నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు**

**పగటి కలలు కనకండి.. 'రెడ్ బుక్' రాసే నైతిక హక్కు మీకు ఎక్కడుంది? అంటూ ఘాటు విమర్శలు**







**ఖమ్మం ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం)** ఖమ్మం రాజకీయం అంటే గద్దెనెక్కి దొరతనం చేయడం కాదు పేదోడి కన్నీరు తుడవడం. ఈ నెల 1వ తేదీన ఇదే వేదిక మీద నుంచి హామీ ఇచ్చాను 15 రోజుల్లోపు మీ సమస్య పరిష్కరిస్తానని. అన్న మాట ప్రకారం, ఇచ్చిన గడువు కంటే ముందే బాధితులుగా ఉన్న నా కుటుంబ సభ్యులను లబ్ధిదారులుగా చూడటం నాకెంతో గర్వంగా ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు బుధవారం ఖమ్మం ఐడిఓసిలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రితుమ్మలనాగేశ్వరరావుతో కలిసిఆయన311మందివెలుగుమట్లనిర్వాసితులకుఇండ్లపట్టాలు,మంజూరుపత్రాలను అందజేశారు

**కళ్లుండి చూడని కబోదులు!**

గత ప్రభుత్వ పదేళ్ల వైఫల్యాలపై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. "2017 నుంచి ఈ ఆడబిడ్డలు తాగడానికి నీళ్లు లేక, పాములు, జెర్రుల మధ్య నరకం అనుభవిస్తుంటే గత ప్రభుత్వానికి కళ్లు కనపడలేదా? కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరించారు. 2023లో ఇదే కాలనీని కూల్చేయడానికి ప్రయత్నించినప్పుడు పేదలు మిమ్మల్ని ప్రతిఘటిస్తే తోకముడుచుకుని వెళ్లిన మీరు, ఈరోజు పేదోడి గురించి అవాకులు చెవాకులు పేలుతారా? మీకు ఆ నైతిక హక్కు ఎక్కడుంది?" అని మండిపడ్డారు.

**పగటి కలలు.. 'రెడ్ బుక్' హెచ్చరికలు!**

ప్రతిపక్ష నేత 'రెడ్ బుక్' రాస్తాననడంపై పొంగులేటి ఎద్దేవా చేస్తూ ఘాటుగా స్పందించారు. చీకటి పడకముందే ఎండలో పగటి కలలు కంటున్నారు. నేను ముఖ్యమంత్రిననో, కాబోయే ముఖ్యమంత్రిననో ఊహల్లో ఊగిసలాడకండి. మీ రెడ్ బుక్కులు రాసేదో.. మీరు వచ్చిన తర్వాత కక్షలు చూపించే కార్యక్రమమో.. అసలు అటువంటి అవకాశం తెలంగాణ ప్రజలు మీకు ఇవ్వరు. మీ పగటి కలలు కలలుగానే మిగిలిపోతాయి. మీ దొరల పోకడలు ఇక సాగవు" అని హెచ్చరించారు.

**అర్హతే మా ప్రామాణికం..**

రాజకీయ కక్షసాధింపులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. చివరికి మా మీద దుమ్మెత్తి పోసిన వాళ్లయినా సరే.. వారు నిజంగా అర్హులై ఉంటే చాలు, కడుపున పెట్టుకుని వారికి పట్టాలు ఇచ్చాం. ఇది పేదోడి దీవెనలతో వచ్చిన ప్రజా ప్రభుత్వం. 311 మందికి ఇక్కడే స్థలంతో పాటు ఇల్లు, ఇండ్ల స్థలాలు ఉన్న మరో 101 మందికి వారి వారి గ్రామాల్లోనే ఇందిరమ్మ మంజూరు పత్రాలు పంపామన్నారు. పేదోడి సొమ్ము దోచుకున్న కేటుగాళ్లు ఎంతటి వారైనా సరే.. ఉక్కుపాదంతో తొక్కి, ఆ సొమ్మును తిరిగి ఇప్పించాలని సీపీకి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

**యుద్ధ ప్రాతిపదికన మోడల్ కాలనీ**

కేవలం పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోమని, వారం రోజుల్లోనే తాగునీరు అందిస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీతో పాటు స్కూల్, ఫంక్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు

## ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలులో అలసత్వం వహించవద్దు : దామోదర్ రాజనర్సింహ

వార్తా 2 లో

ప్రజాబలం

12 మార్చ్ 2026 గురువారం

# జెన్ జీ పైనే ఆశలన్నీ...

సౌత్ ఏషియాలో ఓ శక్తివంతమైన కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావాన్ని చూస్తోం ది. జనరేషన్ జెన్ అనే యువతరంగం. విరామం లేని, డిజిటల్‌గా మమేకమై, అసహన తరం. స్మార్ట్ ఫోన్‌లు, సోషల్‌మీడియా, గ్లోబల్ కనెక్టివిటీ యుగంలో ఆవిర్భవించిన ఈ తరం దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయించిన రాజకీయ స్తబ్ధత, అవినీతి, వంశపారంపర్య అధికార వ్యవస్థలను అంగీకరించడానికి సిద్ధంగా లేదు. నేపాల్‌లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఈ తరం మార్పునకు ఓ అద్భుతమైన ఉదాహరణ. బాలేంద్ర షా విజయం, యువత నడిపే రాజకీయ ఉద్యమం విస్తరణ నేపాల్ సాంప్రదాయ రాజకీయ వ్యవస్థను కూల్చివేసింది. అదే సమయంలో, బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలు విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ప్రయోగం నిరసనలను రాజకీయ శక్తిగా మరల్చడంలో విఫలమైంది. నేపాల్‌కు విరుద్ధమైన కథ ఇది. ఈ కథనాలు పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. జనరేషన్ జెన్ భారతదేశంతో సహా దక్షిణాసియా అంతటా రాజకీయాలను పునర్నిర్మించగలదా. నేపాల్‌లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఓ రాజకీయ భూకంపం వంటివే. దశాబ్దాలుగా నేపాల్ రాజకీయం సాంప్రదాయ పార్టీలు, అనుభవజ్ఞులైన నాయకుల ఆధిపత్యంలో సాగేవి. నేపాలీ కాంగ్రెస్ వర్గాలు, కె.పి.శర్మ ఓలి వంటి ప్రముఖుల నేతృత్వంలో కమ్యూనిస్ట్ గ్రూప్‌ల మధ్య రాజకీయ అధికారం ఊగిసలాడింది. 2008లో రాచరిక వ్యవస్థ రద్దయి గణతంత్ర రాజ్యాంగం ఆమోదం పొందినా, వ్యవస్థ మారలేదు నేపాల్ లో రాజకీయ వ్యవస్థ ఒక ఉన్నత వర్గం నుంచి మరో ఉన్నత వర్గానికి బదలీ అయిందని చాలామంది నేపాలీ పౌరులు భావించారు. అవినీతి, కుంభకోణాలు, వర్గపోరు, దీర్ఘకాలిక అస్థిరత ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఫలితంగా జనాభాలో పెద్ద సంఖ్యలో ఉన్న యువ నేపాలీల నిరాశ నిస్పృ?హలు తారస్థాయికి చేరాయి. నేపాల్‌లో జనరేషన్ జెన్ కొత్త తరహా రాజకీయాలను కోరింది- పారదర్శకంగా, జవాబుదారీగా, దేశపాలనను నియంత్రించిన పాలకులనుంచి విముక్తి పొందింది. ఇందుకు సోషల్ మీడియా ప్రధాన సాధనంగా మారింది. కార్యకర్తలు నిరసనలు నిర్వహణకు, సమాచారాన్ని పరస్పరం పంచుకోవడానికి, రాజకీయ సంకేతాలను అనూహ్యమైన వేగంతో సమన్వయం చేయడంలో వీలు కల్పించింది. డిజిటల్ లాండ్ స్కేప్ నేపాలి యువతలో కొత్తరాజకీయ చైతన్యాన్ని సృష్టించడంలో కీలకం అయింది. పట్టణాలలోని కార్యకర్తలు, విద్యార్థులు, యువ నిపుణులను శక్తివంతమైన సమష్టి శక్తిగా ఏకంచేసింది. ఈ పరిణమాలనుంచి బాలేంద్ర షా అనే యువ తరంగం ఉద్భవించాడు. అందరూ బాలెన్ అని పిలిచే, రాపర్, ఇంజనీర్, ఆతర్వాత కాలంలో ఖాట్మండు మేయర్ అయిన బాలేంద్ర షా, సాంప్రదాయ రాజకీయ తరగతికి పూర్తి భిన్నంగా ప్రాతినిధ్యం వ్యవహరించాడు. యువకుడు, నిష్కపటంగా మాట్లాడేవాడు కావడం సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అతడు నేపాల్ పట్టణ యువత ఆకాంక్షలను నేరుగా తీర్చాడు. అతడి ఆవిర్భావం దశాబ్దాలుగా నేపాల్‌పై ఆధిపత్యం సాగించిన పాత రాజకీయ సంస్కృ?కతి నీరుగారిపోయింది. బాలెన్ షా రాజకీయ విజయం యాదృచ్ఛికం కాదు. అతడి ప్రచారం యువత నిరసన శక్తిని సమర్థంగా ఉపయోగించుకుంది. దానిని ఒక వ్యవస్థీకృత ఎన్నికల ఉద్యమంగా మార్చింది. సోషల్ మీడియా కీలక పాత్ర, అట్టడుగు వర్గాల సమీకరణ, సుపరిపాలన, అవినీతి నిరోధక సంస్కరణలతో కేంద్రీకృతమైన సందేశంతో బాలేంద్ర షా, అతని మిత్రులు నేపాల్‌లో రాజకీయ పార్టీలకు దీటైన ప్రత్యామ్నాయాన్ని నిర్మించడంలో విజయం సాధించారు. నేపాల్ ఎన్నికల ఫలితాలు సాంప్రదాయ రాజకీయ ఉన్నత వర్గాలపట్ల ప్రజల సంతృప్తిని ఎత్తిచూపాయి. దశాబ్దాలలో మొదటిసారిగా, నేపాల్ ప్రధాన పార్టీల దీర్ఘకాలిక ఆధిపత్యం, యువత క్రియాశీలతతో తలెత్తిన కొత్త రాజకీయశక్తినుంచి తీవ్రమైన సవాలు ఎదుర్కొంది. షా విజయం ఒకప్పుడు నిరసనల ద్వారా తమ కోపాన్ని వ్యక్తం చేసిన తరం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. బిఎన్‌పి పునరాగమనం, ప్రభుత్వ మార్పును సూచిస్తున్నా, యువత ఆశించిన పరివర్తనను అది పాదుకొల్పలేదు. బంగ్లాదేశ్ అనుభవం నిరసన ఉద్యమాలను స్థిరమైన రాజకీయ సంస్థలను మార్చడంలో ఎదురయ్యే ఇబ్బందులను చెప్పక చెబుతోంది. నేపాల్, బంగ్లాదేశ్‌లలో ఎదురైన విభిన్నమైన ఫలితాలు, యువత రాజకీయాల గురించి ఓ ప్రాథమిక సత్యాన్ని వివరిస్తాయి. సామూహిక నిరసనలు, రాజకీయ వ్యవస్థలను సవాల్ చేయగలవు కానీ, మార్చలేవు. విశ్వసనీయమైన నాయకత్వం, స్పష్టమైన దృక్పథం, ఎజెండాతో నిసనలు రాజకీయ ఉద్యమాలుగా పరిణామం చెందకపోతే, ఉన్న వ్యవస్థ స్థానే కొత్త వ్యవస్థను నిర్మించలేవు. నేపాల్‌లోని జనరేషన్ జెడ్ తిరుగుబాటు యువతశక్తిని ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశపెట్టగల నాయకుడిని తయారు చేయడం వల్లే విజయవంతం అయ్యాయి. అతి పెద్ద దేశం, ఎన్నో రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు లోతైన సంస్థాగత నెట్ వర్క్, ఆర్థిక వనరులు కలిగి ఉంటాయి. అవి కొత్త ఉద్యమాలను కష్టతరం చేస్తాయి. భారతదేశంలో ఎన్నికల రాజకీయాలకు విస్తృత స్థాయిలో అట్టడుగు స్థాయినుంచి సమీకరణ, సంస్థాగతంగా సంకీర్ణపరమైన నిర్మాణం అవసరం. ఇంకా కులం, మతం, భాష, ప్రాంతీయ గుర్తింపులతో కూడిన విస్తృతమైన సామాజిక వైవిధ్యం, తరచు రాజకీయ సమీకరణలను విచ్ఛిన్నం చేస్తుంది. యువత క్రియాశీలత జాతీయ దృష్టిని ఆకర్షించినా, ఆ శక్తి ఏకీకృత రాజకీయ ఉద్యమంగా మార్చడం సవాల్‌గా మిగిలిపోతుంది. అయినా, భారతదేశంలో జనరేషన్ – జెడ్ రాజకీయ తరంగాన్ని తక్కువగా అంచనా వేయలేం. యువ ఓటర్లు నిర్మాణాత్మక ఎన్నికల కూటమిగా మారుతున్నారు. రాజకీయ పార్టీలు, తమ అజెండాలు, నాయకత్వాలను నిర్మించడంలో యువ ఓటర్ల డిమాండ్లను ప్రతిబింబించేలా మార్చుకోవచ్చు. డిజిటల్ సమీకరణతో అట్టడుకు స్థాయి యువత ఆధారిత ఉద్యమం ఉద్భవిస్తే, భారతదేశ రాజకీయ దృశ్యం సమర్థవంతంగా పునర్మాణం కాదలదు. ఈశాన్య భారతంలో అటువంటి మార్పునకు వీలు కల్పిస్తున్నది. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలు భారతదేశంలోని మిగతా ప్రాంతాలతో సిలిగురి కారిడార్ ద్వారా అనుసంధానమై ఉన్నాయి. ఈ ప్రాంతానికి అటు నేపాల్, ఇటు బంగ్లాదేశ్ ఉన్నాయి. ఈ పొరుగు దేశాలలో రాజకీయ పరిణామాలు భారతదేశానికి వ్యూహాత్మకంగా ముఖ్యమైనవిగా మారాయి. నేపాల్ రాజకీయ కొత్త నాయకత్వంలో మార్పు, సరిహద్దు ఆర్థిక సహకారాన్ని ప్రభావితం చేయవచ్చు. యువ నాయకత్వంలో సంస్కరణలతో కూడిన ప్రభుత్వ మౌలిక సదుపాయాల అభివృద్ధి, వాణిజ్య విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వగలదు. ఈ విధానాలు నేపాల్, బంగ్లాదేశ్, భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయగలవు. బంగ్లాదేశ్ రాజకీయ పథం అంతే కీలకమైనది. భారదేశ ప్రధాన భూ భాగాన్ని ఈశాన్య ప్రాంతాలతో కలిపే కనెక్టివిటీ ప్రాజెక్టులకు ఈ దేశం ప్రధాన రవాణా మార్గంగా పని చేస్తుంది. బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వం నెలకొంటే ఈ ప్రాంత ఆర్థిక భవిష్యత్‌ను రూపొందించడంలో కీలక పాత్ర వహిస్తుంది. నేపాల్‌లో, దక్షిణాసియాలోని ఇతర ప్రాంతాలలో యువత నేతృత్వంలో రాజకీయ ఉద్యమాలు ఊపందుకుంటే, ఈ ప్రాంతం అంతటా రాజకీయ చర్చను ప్రభావితం చేయవచ్చు. నేపాల్, బంగ్లాదేశ్ నుంచి అందిన పాఠాలు భారతదేశానికి ప్రోత్సాహకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలోని యువజనాభా ప్రజాస్వామ్య రాజకీయ ఉద్యమాలను పునర్నిర్మించే సామర్థ్యం కలిగి ఉంది. ఆ సామర్థ్యాన్ని నిజమైన రాజకీయశక్తిగా మార్చే నాయకత్వం, సంస్థ, సంస్థాగత ఆవిష్కరణలు అవసరం.

# ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లకు ప్రణాళికలు

### హైదరాబాద్ నుంచి నిర్దేశిత సమయంలో చేరేలా ప్రణాళికలు
### బోధనాసుపత్రులు, పెద్దాసుపత్రుల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలి
### ప్రభుత్వ శాఖలు ఈవీ వాహనాలే కొనుగోలు చేయాలి..
### ఆర్ అండ్ బీ, రవాణా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్: ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి రింగు రోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం తెలిపారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్–విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగార్జున సాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.కాలుష్య రహిత రవాణాయే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రభుత్వంలోని ఏ శాఖైనా తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ వాహనాలనే కొనుగోలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ప్రభుత్వ శాఖల పరిధిలో అద్దెలకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని సీఎం తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ పద్ధతులకు స్వస్తి చెప్పాలని.. మొత్తం ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. ఆర్‌టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని... ఇందుకు షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించాలని సీఎం సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్ కు స్థలం కేటాయిస్తామని.. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలులో అలసత్వం వహించవద్దు : దామోదర్ రాజనర్సింహ





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలులో అలసత్వం వహించవద్దని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ బృహత్తర కార్యక్రమ పురోగతి, అమలు తీరుపై బుధవారం ఆయన సెక్రటేరియట్ నుంచి ఆరోగ్యశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (రాజు-త్రా) అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్రటేరియట్ నుంచి ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్ పాల్గొనగా.. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ సహా అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ఇతర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. టెస్టుల కోసం గ్రామాల నుంచి మహిళలను హాస్పిటల్స్‌కు తీసుకురావడానికి, పరీక్షల అనంతరం వారిని తిరిగి సురక్షితంగా ఇళ్ల వద్ద దింపడానికి వాహనాలను సమకూర్చాలని సెర్ప్ అధికారులకు సూచించారు. హాస్పిటల్స్‌లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎక్కువసేపు వేచి ఉండే అవసరం లేకుండా అవసరమైన మేర డాక్టర్లు, సిబ్బందిని అందుబాటులోకి ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. కుర్చీలు, తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. ఒకేరోజు ఎక్కువ మందిని హాస్పిటల్‌కు తరలించి, వారికి ఇబ్బంది కలిగించొద్దన్నారు. ఒక పద్ధతి ప్రకారం షెడ్యూల్ మెయింటేయిన్ చేయాలని సూచించారు. స్క్రీనింగ్‌లో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తేలితే, వారికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే చికిత్స ప్రారంభించాలన్నారు. స్క్రీనింగ్ జరిగే అన్ని హాస్పిటళ్లు, డయాగ్నస్టిక్ సెంటర్లలో అవసరమైన మేర సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. మహిళల నుంచి రక్త నమూనాల సేకరణ మొదలుకొని.. వాటిని ల్యాబ్‌లకు చేర్చే వరకు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, సాంపిల్స్ దెబ్బతినకుండా పక్కాగా కోల్డ్ చైన్ ప్రోటోకాల్స్ మెయింటైన్ చేయాలన్నారు. ల్యాబ్‌లో నమూనాల వివరాలు (డేటా) ఎంటర్ చేసేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని మంత్రి హెచ్చరించారు. అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించి స్క్రీనింగ్ జరుగుతున్న తీరును పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా చిన్నపాటి లోపాలు తలెత్తితే, వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అన్ని విభాగాల మధ్య పక్కా సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ – ముఖ్యాంశాలు:

దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం ఈ ప్రణాళికను రూపొందించింది. నాన్–కమ్యూనికబుల్ వ్యాధులను ముందుగానే గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

46 లక్షల మంది.. 30 రకాల పరీక్షలు: రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లోని 542 మండలాల పరిధిలో ఉన్న సుమారు 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్కో మహిళకు రక్తహీనత (అనీమియా), మధుమేహం, బీపీ, థైరాయిడ్, కాలేయం, కిడ్నీ పనితీరు తదితర 30 రకాల (జనరల్ మరియు ల్యాబ్) ఆరోగ్య పరీక్షలు చేస్తారు.

రెండు దశల్లో అమలు: తొలి దశలో ప్రతి జిల్లాలోని 5 మండలాల్లో ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. మౌలిక వసతులు, సిబ్బంది లభ్యత ఆధారంగా రెండో దశలో మిగిలిన అన్ని మండలాలకు దీనిని విస్తరిస్తారు.

సెర్ప్, వైద్యశాఖ సమన్వయం: సెర్ప్ (SERP) ఆధ్వర్యంలో మహిళలను సమీపంలోని పీహెచ్‌సీలకు తరలిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రిజిస్ట్రేషన్, జనరల్ చెకప్, బ్లడ్ శాంపిల్స్ కలెక్షన్ జరుగుతుంది. అక్కడినుంచి టీ–డయాగ్నస్టిక్స్‌కు శాంపిల్స్ తరలించి, అక్కడ పరీక్షలు చేస్తారు.

పేపర్‌లెస్ డిజిటల్ హెల్త్ రికార్డులు: లబ్ధిదారుల ఆరోగ్య సమాచారాన్ని పదిలంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరికీ క్యూఆర్ (QR) కోడ్ అనుసంధానంతో (ABHA ID ద్వారా) డిజిటల్ హెల్త్ రికార్డులను సృష్టించి, ఈ–హెచ్ఎంఐఎస్ (e-HMIS) ప్లాట్‌ఫారమ్‌కు అనుసంధానిస్తారు. ఈ రిపోర్టులను నేరుగా లబ్ధిదారుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ (వామీా) రూపంలో, అలాగే 'ఈ–ఆరోగ్యం' (e-Aarogyam) యాప్ ద్వారా అందిస్తారు.

ఈ డిజిటల్ డేటాబేస్ ద్వారా భవిష్యత్తులో రాష్ట్రంలో ఏ ప్రభుత్వ హాస్పిటల్‌కు వెళ్లినా.. మహిళలు తమ రిపోర్టులను కాగితాల రూపంలో తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండానే సులభంగా వైద్య సేవలు పొందే అవకాశం లభిస్తుంది.

# ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ వ్యవస్థను ఏర్పాటు

అమరావతి : రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం జరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు యాక్షన్ ప్లాన్ ప్రకటించారు. వ్యవసాయానికి ప్రోత్సాహమిచ్చేలా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అనే వ్యవస్థను ఏర్పాటు చేస్తామంటూ సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇండియన్ బిజినెస్ స్కూల్ తరహాలో వ్యవసాయం కోసం అత్యున్నత సంస్థ ఏర్పాటు చేద్దామని అన్నారు.

## జనాభా లెక్కల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 11 :** జనాభా లెక్కల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి జిల్లాలోని మండలాల తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు,మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కల ప్రాతిపదిక ఉపయోగపడుతుందని తెలిపారు. జనాభా లెక్కల విధులను సక్రమంగా నిర్వహించాలని, తద్వారా ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వానికి అవగాహన వస్తుందని తెలిపారు. జనాభా లెక్కల ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగం,ఇతర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డిజిటల్ పద్ధతిలో జనాభా గణనను నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా,లోప రహితంగా పూర్తి చేయాలని,జనగణన ద్వారా సేకరించే గణాంకాలు గ్రామ,పట్టణ,రాష్ట్ర,జాతీయ స్థాయిలో అభివద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది వంటివని తెలిపారు. పాఠశాలలు, ఆసుపత్రులు,రహదారులు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల కల్పనకు,అలాగే సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని తెలిపారు. వయస్సు, విద్యార్హత, వృత్తి,సామాజిక వర్గం, మౌలిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని,ఖచ్చితమైన సమాచారం మాత్రమే నమోదు చేయాలని,33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాలని తెలిపారు. మొదటి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల భవనాలు,కుటుంబ వివరాలను, 2వ దశలో వ్యక్తిగత వివరాలను సేకరించడం జరుగుతుందని,దేశంలోనే తొలిసారిగా డిజిటల్ పద్ధతి ద్వారా జనాభా గణనను పూర్తిగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జనాభా గణనలో అందరూ పాల్గొని వాస్తవ వివరాలను వెల్లడించాలని,ఎవరి వివరాలు బహిర్గతం కాకుండా,సర్వర్‌లో నేరుగా నిల్వ ఉండేలా సాంకేతికతను ఉపయోగించడం జరుగుతుందని తెలిపి. స్వీయ ప్రకటన చాలా ముఖ్యమని, అధికారులు, ఎన్యూమరేటర్లు సమన్వయంతో పనిచేయాలని,అధికారులు ప్రతి రోజు జనాభా గణన ప్రక్రియను సమీక్షించాలని, నిర్ణీత కాలపరిమితి లోపు జనాభా గణన ప్రక్రియను మెరుగైన రీతిలో పూర్తి చేయడానికి అందుబాటులో ఉన్న సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రణాళికలు,అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జనాభా గణన ప్రక్రియను నిబద్ధతతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్ పెద్ద చెరువులోని అక్రమ నిర్మాణాలపై

## అధికారులు కొరడా జరిపించారు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ఆందోల్- జోగిపేట, మున్సిపల్ పరిధిలో గల ఆందోల్ చెరువులో చేపడుతున్న, అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, తహసిల్దార్ మధుకర్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులు స్పందించారు, చెరువు శిఖం భూముల్లో చేపడుతున్న, అక్రమ నిర్మాణాన్ని నిన్న పరిశీలించారు, చెరువు కబ్జాకాకుండా కాపాడేందుకు, అధికారులు సిద్ధమయ్యారు, దీనిలో భాగంగా సింపుల్గా చెప్పాలంటే, ఆందోల్ చెరువు పర్యావరణ పరిరక్షణ పేరుతో, ఇప్పుడు అక్రమార్కుల భరతం పట్టేందుకు సిద్ధమయ్యింది, చెరువుల బఫర్ జోన్లను, నాలాలను ఆక్రమించన చోట్లను, గుర్తించి అక్కడ ఉన్న అక్రమ నిర్మాణాలను, తొలగించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాల పై ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు, చెరువు ఎఫ్టిఎల్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాలను, రెవెన్యూ మున్సిపల్ అధికారుల సహకారంతో, జెసిబి లతో రంగంలోకి దిగి, చెరువులో శిఖం భూంలోని, సర్వే నంబర్ 409 లో చేపడుతున్న ఓ ఇంటి నిర్మాణం పునాదులను, రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు, ఈ సందర్భంగా తహసిల్దార్ ,మధుకర్ రెడ్డి మాట్లాడుతూ, చెరువులు కుంటలు బఫర్ జోన్ పరిధిలో, అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు, ప్రభుత్వ భూముల చెరువుల సమీపంలో, కబ్జా చేసి నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన తర్వాత, మళ్లీ తిరిగి నిర్మిస్తే పీడియాట్ పెట్టేలా, రెవెన్యూ యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తుందని, ప్రభుత్వ భూములు చెరువుల స్థలంలో అక్రమ నిర్మాణం నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు, చెరువులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదీ అని తహసిల్దార్ మధుకర్ రెడ్డి,కోరారు, ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మధుకర్ రెడ్డి, ఆర్ఐ మహేందర్ రెడ్డి,గ్రామ పాలనధికారి పాండు, వర్క్ ఇన్స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు...



## పెళ్లి విషయంలో ప్రేమజంట వాగ్వాదం..

### మాట నెగ్గలేదని ప్రియుడు ఆత్మహత్య

మహబూబాబాద్ ఈ రోజే పెళ్లి చేసుకుందామన్న యువకుడు.. ఇంటర్ పరీక్షల తర్వాత చేసుకుందామని చెప్పిన యువతి, దీంతో మనస్తాపం చెంది ఉరి వేసుకొని ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లాలో ఘటన జరిగింది. కురవికి చెందిన పెయింటర్ వల్లపునేని శశికుమార్ (21), కేసముద్రం శివారు తండాలోని ఇంటర్ చదువుతున్న యువతి (20).. ఒకరినొకరు సంవత్సర కాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే శశికుమార్.. యువతికి ఫోన్ చేసి, ఇద్దరం ఈ రోజే పెళ్లి చేసుకుందామని పట్టుబట్టగా.. అయితే ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని, అవి పూర్తయ్యాక పెళ్లి చేసుకుందామని యువతి సర్దిచెప్పింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ప్రియురాలు తన మాట వినకపోవడంతో క్షణికావేశానికి గురైె శశికుమార్ కురవిలోని తన ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## లట్టుపల్లి లో ఆశా కార్యకర్తలకు

## యూనిఫామ్ చీరల పంపిణీ....

## లట్టపల్లి వైద్యాధికారి డాక్టర్ టి.ప్రసన్న.




**నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రల పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ వస్త్రాలు ప్రతి ఆశా కార్యకర్తకు రెండు చీరలను బుధవారం నాడు లట్టుపల్లి వైద్యాధికారి డాక్టర్ టి.ప్రసన్న యూనిఫామ్ చీరలను ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన యూనిఫామ్ చీరలను ఆశా కార్యకర్తలకు ప్రతి సంవత్సరం రెండు చీరలు ఇస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో యూనిఫామ్ ధరిస్తే ప్రజలు ఆశాగా గుర్తించి అవసరమైన ఆరోగ్య సేవలు పొందుటకు సులువు అవుతుందని ఆమె అన్నారు. లట్టపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 22 మంది ఆశా కార్యకర్తలు ఉన్నారని వారికి బుధవారం నాడు ప్రతి ఆశకు రెండు చొప్పున 44 చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ నోడల్ పర్సన్ బాలమణి, హోమియో వైద్యులు డాక్టర్ మేఘనా రెడ్డి, ఆరోగ్య సిబ్బంది శశికళ, వరలక్ష్మి,బొజ్జమ్మ, విజయలక్ష్మి,జ్యోతి,జకియా, నగేష్ ,సుమిత్ర,స్వరూప రాణి, చంద్రశేఖర్,లట్టుపల్లి,మంగనూర్,గంగారం,ఎర్రకుంట తండా ఆరోగ్య ఉప కేంద్రాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నో స్మోకింగ్ డే పై

## అవగాహన కార్యక్రమం......



**నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నో స్మోకింగ్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సమక్షంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధూమపానం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు. ధూమపానం సేవించడం అత్యంత ప్రమాదకరమని, ఎట్టి పరిస్థితుల్లోనూ దానికి దగ్గర కాకుండా ఉండాలని ఆయన సూచించారు. ధూమపానం కారణంగా ప్రతి ఏడాది లక్షలాది మంది క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల బారినపడి మరణిస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ధూమపానం అలవాటు ఉన్నవారు దానిని మానుకోవాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో ధూమపానం నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలనపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల అంజయ్య, వనిత,కోదండరాములు, ఉమాదేవి,రామకృష్ణ, దశరథం తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ ఇఫ్తార్ విందును విజయవంతం చేయాలి.

### ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి దావత్-ఎ-ఇఫ్తార్ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

### రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

రంజాన్ ఇఫ్తార్ ఏర్పాట్లను వేగవంతంగా చేపట్టి నిర్దేశించిన సమయానికి అందించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అధికారులను ఆదేశించారు

రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెల మార్చి 15న ఎల్‌బీ స్టేడియంలో దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిలతో కలిసి మంత్రి వివిధ శాఖల అధికారులతో ఎల్‌బీ స్టేడియంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది తన మొదటి రంజాన్ దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమమని, దీనిని ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సహకారం, సమన్వయంతో కలసి పని చేయాలని సూచించారు. కార్యక్రమానికి భద్రతా ఏర్పాట్లు, ఆహార భద్రతా ప్రమాణాలు, సరిపడా ఆహార సరఫరా, తగిన సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, ఇతర ప్రముఖులతో కలసి మంత్రి శాఖల వారిగా చేపట్టబోయే ఏర్పాట్లపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కమిషన్ చైర్మన్లు, సభ్యులు మరియు మతపెద్దలు ఈ వేడుకలకు హాజరుకానున్నారని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

ఇఫ్తార్ కు సుమారు పదివేల మంది పాల్గొనే అవకాశం ఉందని ఆ దిశగా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యంగా ప్రోటోకాల్ తప్పక పాటించాలని సూచించారు.

గత క్రిస్మస్ డిన్నర్ సందర్భంగా ఎల్బీ స్టేడియంలో వివిధ శాఖలు సమన్వయంతో చేసిన సమర్థవంతమైన ఏర్పాట్లకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, అదే ఉత్సాహంతో పని చేయాలని అధికారులకు సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లను మరింత మెరుగ్గా ఉండేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు .

పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పార్కింగ్ సౌకర్యం, ట్రాఫిక్ మళ్లింపు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ స్టేజి, గ్యాలరీలు, బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇఫ్తార్ వేడుకలకు వచ్చేవారికి ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నం కాకుండా సరిపడా ఆహార కౌంటర్లు, తగిన సంఖ్యలో సర్వర్లు, త్రాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . అలాగే నాణ్యత ప్రమాణాలతో ఆహార పదార్థాలు ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ఆహార భద్రత పరీక్షలు చేపట్టాలని అలాగే వంటలు చేసే ప్రాంతంలో పరిశుభ్రత కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇఫ్తార్ సందర్భంగా ముందుగా ఎల్బీ స్టేడియం మొత్తం ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు ఉండేలా చూడాలని అలాగే సౌండ్ ప్రూఫ్ జనరేటర్ ని కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డయాస్ ను పూల అలంకరణతో చేపట్టి , మొక్కలు, కుండీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మెడికల్ శిబిరాలు ఏర్పాటుతో పాటు వైద్యులు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక శాఖ వంట, క్యాటరింగ్ ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా ఫైర్ టెండర్లు , సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు.

సమాచార శాఖ ద్వారా ఎల్ఈడి స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో పాటు కార్యక్రమానికి ప్రత్యక్ష ప్రసారం నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని, ప్రొఫెసర్ ఎస్.ఏ. షుకూర్, అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, ఖైరతాబాద్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శిల్పావల్లి, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జి.వి. నారాయణరావు, సమాచార శాఖ అదనపు సంచాలకులు జగన్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాధాకృష్ణ, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాములు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్ బాబు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్,

పోలీస్, జీహెచ్ఎంసీ, మైనార్టీ శాఖ, ఆర్ అండ్ బి, వాటర్ సప్లై, విద్యుత్, అగ్నిమాపక, ఉద్యాన, వైద్య , సమాచార శాఖ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీయేకు జై కొట్టిన జగన్



విజయవాడ, మార్చి 11, జాతీయస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి చర్చకు వచ్చింది. ఆ పార్టీ ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. జాతీయస్థాయిలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఇండియా కూటమి అంతా ఈ తీర్మానానికి మద్దతు ప్రకటించింది. తృణమూల్ కాంగ్రెస్ సైతం తమ మద్దతు పై ప్రకటన చేసింది. దీనిపై పార్లమెంట్లో చర్చ జరగనుంది. ప్రభుత్వ సమాధానం తర్వాత ఓటింగ్ నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసానికి మద్దతు ఇస్తుందా? వ్యతిరేకిస్తుందా అనేది హాట్ టాపిక్. ఒక విధంగా ఇది ఆ పార్టీకి సంక్లిష్ట సమస్య. అవిశ్వాసానికి మద్దతు ఇస్తే బిజెపి ఆగ్రహానికి గురికాక తప్పదు. ఒకవేళ వ్యతిరేకిస్తే మాత్రం జాతీయస్థాయిలో ఆ పార్టీకి స్నేహితులు అనేవారు కరువు అవుతారు.వైసీపీ నిర్ణయంపై హాట్ డిస్కషన్.. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి 21 మంది కూటమి ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా ఎన్డీఏ కు మద్దతుగా ఉంటారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కచ్చితంగా వీరు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి. పోనీ తెలంగాణలో కెసిఆర్ పార్టీకి ఎంపీలు ఉన్నారా అంటే లేరు. దీంతో ఆ పార్టీకి వచ్చిన ఇబ్బందులు ఏమీ లేవు. 17 మంది ఎంపీలకు గాను చెరి సగం ఎంపీలు కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి పంచుకున్నాయి. ఎంఐఎం కు ఒక్క ఎంపీ ఉన్నారు. అయితే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ఏంటి అనేది హాట్ టాపిక్.గతంలో ఉపరాష్ట్రపతి త పాటు స్పీకర్ ఎన్నికల సమయంలో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇచ్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తాజాగా జగన్మోహన్ రెడ్డి తన పాత కేసుల విషయంలో బెంగళూరు వేదికగా కీలక చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వచ్చాయి. మద్యం కుంభకోణం, వివేకానంద రెడ్డి హత్య కేసు, జగన్ పై ఉన్న పాత కేసులు తెరపైకి వస్తున్న నేపథ్యంలో.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా ఎన్డీఏకు మద్దతుగా నిలుస్తారన్న వారే అధికం. పార్టీ ఎంపీలతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. సూత్రప్రాయంగా ఎన్డీఏకు మద్దతు ఇచ్చేందుకు ఒక నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఒకవైపు బిజెపి భాగస్వామిగా ఉన్న కూటమికి వ్యతిరేకంగా ఉంటూనే.. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉన్న ఎన్డీఏకు జగన్మోహన్ రెడ్డి మద్దతు తెలపడం మాత్రం జాతీయస్థాయిలో హాట్ టాపిక్ అవుతోంది. ఇది ఆ పార్టీకి ఇబ్బందికరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# లిక్కర్ స్కాంలో ఆస్తుల అటాచ్

విజయవాడ, మార్చి 11, ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ లో ఈడీ దూకుడు పెంచింది. మాజీ సీఎం జగన్ తరపున పనులు చక్కబెట్టారన్న ఆరోపణలున్న వారిని ఈడీ పిలిచి ప్రశ్నిస్తోంది. ఇప్పటికే వెయ్యి కోట్ల మనీలాండరింగ్ ను గుర్తించినట్లుగా చెప్పి నాలుగు వందల కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేసింది. సిట్ దర్యాప్తుపై వైసీపీ తీవ్ర విమర్శలుచేసింది. అసలు మద్యం స్కామే లేదని అంతా సృష్టిస్తున్నారని ఆరోపించింది. కానీ ఈడీ దర్యాప్తుపై మాత్రం నోరు మెదపడం లేదు. ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఆంధ్రప్రదేశ్ మద్యం స్కాంలో జరిగిన సుమారు రూ. 4,000 కోట్ల కుంభకోణం కేసులో ఈడీ తన పట్టును బిగిస్తోంది. ఏకంగా రూ. 441.63 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. ఇందులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి, బూనేటి చాణక్య, వాసుదేవరెడ్డి వంటి వారి స్థిరాస్తులు, బ్యాంక్ నిల్వలు ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు రూ. 1,048 కోట్ల మేర ముడుపులు చేతులు మారినట్లు ఈడీ నిర్ధారించింది. మద్యం తయారీదారుల నుంచి బలవంతంగా నగదు, బంగారం వసూలు చేశారని, ఆ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించారని దర్యాప్తు సంస్థ గట్టి ఆధారాలు సేకరించింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు చేపట్టినప్పుడు వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా స్పందించాయి. అదంతా రాజకీయ కక్ష సాధింపు అని, టీడీపీ ప్రభుత్వం కావాలనే అబద్ధపు కేసులు సృష్టిస్తోందని ఆరోపించాయి. కానీ, ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగి ఆస్తులను జప్తు చేస్తున్నా, నోటీసులు జారీ చేస్తున్నా వైఎస్సార్సీపీ అగ్రనాయకత్వం నుంచి ఆ స్థాయిలో ఖండనలు రావడం లేదు. సిట్‌ను విమర్శించినట్లుగా ఈడీని విమర్శించలేకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం , భయం దాగి ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఈడీని నేరుగా టార్గెట్ చేస్తే అది ఢిల్లీ స్థాయిలో రివర్స్ అవుతుందనే ఆందోళన వైఎస్సార్సీపీలో కనిపిస్తోందని చెబుతున్నారు. అందుకే సిట్‌ను రాష్ట్ర ప్రభుత్వ విభాగంగా ముద్ర వేసి తిట్టగలిగిన వారు, ఈడీ దగ్గరకు వచ్చేసరికి మౌనంగా ఉండిపోతున్నారు. ఈడీ తన దర్యాప్తులో మనీ లాండరింగ్ ఆధారాలతో చర్యలు తీసుకోవడం వైఎస్సార్సీపీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం రాజకీయ ఆరోపణలైతే ప్రజల్లో సానుభూతి పొందవచ్చు, కానీ వందల కోట్ల ఆస్తులను జప్తు చేయడం, నగదు లావాదేవీలను సాక్ష్యాలతో సహా చూపడం వంటివి ప్రజల్లో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయి. ఈ స్కామ్‌లో ఇప్పటికే జగన్ కు అత్యంత సన్నిహితులుగా వ్యవహరించిన వారిని పిలిచి ప్రశ్నించారు ఈడీ అధికారులు. ఐదేళ్ల పాటు వైసీపీ హయాంలో పూర్తి స్థాయిలో చక్రం తిప్పిన మాజీ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ వ్యక్తిగత పీఏ కృష్ణమోహన్ రెడ్డి వంటి వారిని పిలిపించి.. గత పదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లను తీసుకున్నారు. అలాగే జగన్‌కు మరో అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఏ1 నిందితుడు రాజ్ కేసిరెడ్డిని కోర్టు అనుమతితో విచారించి కీలక వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగానే ప్రస్తుతం ఇతర అధికారులకు, రాజకీయ అనుచరులకు నోటీసులు వెళ్తున్నాయి. ఈ అంశంపై విమర్శలు గుప్పించడం కన్నా. ..సైలెంట్ గా ఉండటమే మంచిదని వైసీపీ భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

# పరకామణి అక్రమాలపై సిఐడి, ఏసీబీ విచారణ

## జరపాలి భూమన

తిరుపతి టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుమల పరకామణి లెక్కింపులో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 2024 అక్టోబర్ 6న సీనియర్ అసిస్టెంట్ ఎస్. కృష్ణ కుమార్ పరకామణి రిజిస్టర్లో డబ్బుల నమోదులో అక్రమాలకు పాల్పడ్డాడు. సుమారు 950 విదేశీ కరెన్సీ నోట్లను (100 డాలర్లు) తక్కువ విలువగా చూపించి టీటీడీకి అప్పగించాడు. అసలు విలువ సుమారు రూ.87.21 లక్షలు కాగా, ఎఫ్ఐఆర్లో రూ.6.74 లక్షల దుర్వినియోగం మాత్రమే చూపించారని అన్నారు. అక్టోబర్లో జరిగిన ఘటనపై 2025 మార్చి 14న మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు కావడం విడ్డూరమని అన్నారు.ఈ ఆలస్యంతో నిందితుడు అరెస్టు కాకుండా సుప్రీం కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందాడు. పరకామణి ఉద్యోగి పెంచలయ్యపై 24 సార్లు బంగారం దొంగతనం ఆరోపణలు ఉన్నప్పటికీ కఠిన చర్యలు లేవు. అతని వద్ద 555 గ్రాముల బంగారం, 117 గ్రాముల వెండి దొరికినట్లు సమాచారం. గతంలో రవి కుమార్ 800 డాలర్ల దొంగతనం కేసులో పెద్ద వివాదం చేశారు. తన తప్పుకు ప్రాయశ్చిత్తంగా రవి కుమార్ రూ.100 కోట్ల విలువైన ఆస్తులు టీటీడీకి రాసిచ్చాడు . ప్రస్తుతం జరుగుతున్న పెద్ద ఎత్తున అవినీతిపై ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందనేది నా ప్రశ్న. బి.ఆర్. నాయుడు నేతృత్వంలోని టీటీడీ పాలకమండలి శ్రీవారి ఆభరణాలు, కానుకలకు రక్షణ కల్పించడంలో విఫలమైంది . తిరుమలలో భక్తుల మరణాలు, గోమాతల మరణాలు, నెయ్యి కొరత తీవ్ర ఆవేదనకు గురి చేస్తుంది పరకామణిలో జరుగుతున్న అక్రమాలపై సిఐడి, ఏసీబీ తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు..

# కేడర్ లో అసంతృప్తి..

కాకినాడ, మార్చి 11, జనసేన పార్టీఆవిర్భావ దినోత్సవం అంటే ఆ పార్టీ కేడర్‌కు ఒక పండగ. అణచివేతను ఎదిరించి, ప్రశ్నించే గొంతుకగా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఈసారి పిఠాపురం వేదికగా జరిగే వేడుకలు రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తాయని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా పార్టీ అధిష్టానం ఈ వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం జనసైనికులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది.రాష్ట్ర రాజకీయాల్లో జనసేన గ్రాఫ్ పెరుగుతున్న తరుణంలో, ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన పార్టీ ఆవిర్భావ సభ రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. స్వయంగా అధినేత పవన్ కల్యాణ్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఈ సభ పార్టీ బలోపేతానికి ఒక దిక్సూచిలా మారుతుందని కేడర్ ఎంతో ఆశగా ఎదురుచూసింది. కానీ, ప్రస్తుత నిర్ణయం కార్యకర్తల ఉత్సాహంపై నీళ్లు చల్లిందనే చెప్పాలి.పార్టీ అధికారికంగా చెబుతున్న ప్రధాన కారణం సభ్యత్వ నమోదు. ఇప్పటివరకు దాదాపు 8.70 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు గడువు రేపటితో ముగియాల్సి ఉన్నా, లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ గడువును పొడిగించే ఆలోచనలో అధిష్టానం ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవాలంటే గణాంకాలు ముఖ్యం కాబట్టి, సభ ఏర్పాట్ల కంటే సభ్యత్వాలపైనే పూర్తి దృష్టి పెట్టాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే సభ రద్దు వెనుక ఇతర బలమైన కారణాలున్నాయని సమాచారం. సభ్యత్వ నమోదుతో పాటు మరికొన్ని అంశాలు కూడా ఇందుకు దోహదం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేలాదిగా తరలివచ్చే కేడర్‌కు ఎండ దెబ్బ తగలకుండా చూడటం అధినేత బాధ్యతగా భావిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన కల్తీ పాలు, బాణాసంచా పేలుడు ఘటనలు పార్టీ వర్గాల్లో కొంత ఆవేదనను నింపాయి. ఇలాంటి సమయంలో భారీ వేడుకలు నిర్వహించడం సబబు కాదని పార్టీ భావించి ఉండవచ్చు. పిఠాపురం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం కావడంతో, అక్కడ ఎలాంటి అపశ్రుతులు జరగకూడదని, అత్యంత పకడ్బందీగా మరోసారి పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి.జనసేన పార్టీకి భావోద్వేగాలే బలం. పవన్ కల్యాణ్ పిలుపు కోసం ఎదురుచూసే లక్షలాది మంది యువత, పిఠాపురం వేదికగా ఆయన ఇచ్చే పొలిటికల్ స్పీచ్ కోసం సిద్ధమయ్యారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో ఇలాంటి భారీ బహిరంగ సభలు కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతాయి. ఇప్పుడు సభ రద్దు కావడంతో, క్షేత్రస్థాయిలో కేడర్ డీలా పడిపోయింది. పార్టీ బలోపేతం ముఖ్యమే కానీ కార్యకర్తల ఆత్మీయ కలయిక కూడా అంతే ముఖ్యమనేది సగటు జనసైనికుడి ఆవేదన.నిర్ణయం కఠినంగా ఉన్నా, పార్టీ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా పవన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. సభ రద్దుతో వచ్చిన అసంతృప్తిని పోగొట్టాలంటే, సభ్యత్వ నమోదులో రికార్డు సృష్టించడమే కాకుండా, త్వరలోనే మరో భారీ మేనిఫెస్టో సభ లేదా ప్లీనరీ లాంటి కార్యక్రమాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది.

# ట్రెండింగ్ లో చైనా ప్రొఫెసర్ ప్రిడిక్షన్

బీజింగ్, మార్చి 11, (న్యూస్ పల్స్) ఇరాన్, అమెరికా యుద్ధం 11వ రోజుకు చేరింది. ఇటు ఇరాన్, అటు అమెరికా వెనక్కి తగ్గడం లేదు. ఇరాన్ అణు కార్యకలాపాలు కొనసాగిస్తోందన్న సాకుతో అమెరికా ఈ యుద్ధం మొదలు పెట్టింది. మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్‌ను మట్టుబెట్టినా ఇరాన్ వెనక్కు తగ్గడం లేదు. అమెరికాతోపాటు అమెరికాకు మద్దతుగా ఉన్న ఇజ్రాయెల్, యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, దుబాయ్, బహ్రెయిన్‌తోపాటు 14 దేశాలపై దాడులు చేస్తోంది. యుద్ధం నాలుగు వారాలు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాజాగా యుద్ధం సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ యుద్ధంలో ఎవరు గెలుస్తారన్న చర్చ మొదలైంది.చైనా విశ్లేషకుడు ప్రొఫెసర్ జియాంగ్ ఇరాన్ అమెరికా యుద్ధంపై 2024లో చేసిన ప్రెడిక్షన్ ఇప్పుడు వైరల్‌గా మారింది. 2024 మేలో ట్రంప్ మళ్లీ అధ్యక్షుడవుతాడని, అమెరికా?ఇరాన్ యుద్ధం జరుగుతుందని, అమెరికా ఓడిపోతుందని జియాంగ్ ఊహించాడు. మొదటి రెండు సంభవించాయి, మూడోది జరిగే అవకాశం ఉందని సోషల్ మీడియా వైరల్. ఇరాన్ అసిమెట్రిక్ ఆయుధాలు, ప్రాక్సీలతో పోరాడుతుందని చెప్పాడు.ఇరాన్ పర్వతాలు, విశాల భూభాగం ఆక్రమణకు మలుపిస్తాయి. మిలియన్ల సైన్యం అవసరమని జియాంగ్ అంచనా. అమెరికా దూరం వల్ల లాజిస్టిక్స్ సమస్యలు తలెత్తుతాయి. గల్ఫ్ ఆయిల్ కేంద్రాలు, ఆర్మూజ్ జలసంధి మూతపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.ఏథెన్స్ స్పార్టాతో పోల్చుకుని బలవంతుడైనా దూర యుద్ధంలో ఓడిపోయింది. దీర్ఘకాలం యుద్ధం కొనసాగడం, దూర ప్రాంతం నగరంపై దాడి చేయడం కారణంగా లాజిస్టిక్ సమస్యలు వచ్చాయి. దీర్ఘకాలిక ఒత్తిడి కారణంగా ఏథెన్స్ ఓడిపోయింది. ఇదే పరిస్థితి అమెరికాకు వస్తుందని జియాంగ్ తెలిపారు.యుద్ధం కారణంగా అమెరికా రిసోర్సెస్ తగ్గుతూ, రష్యా?చైనా బలపడతాయని ప్రిడిక్షన్. ఇరాన్ గెలిచినా ప్రాంతీయ నష్టాలు తీవ్రం. యుద్ధం పొడిగితే ప్రపంచ చమురు ధరలు, ఆర్థిక అస్థిరత పెరుగుతాయి. జియాంగ్ ఊహలు నిజమైతే అమెరికా ఆధిపత్యం బలహీనపడుతుంది.

# పార్టీ తోడు లేకుంటే మీరంతా ఎక్కడ..

## చంద్రబాబు క్లాస్?!

విజయవాడ, మార్చి 11, టీడీపీ అధినేత చంద్రబాబు. వివాదాస్పదంగా మారిన ఎమ్మెల్యేలకు తనదైన శైలిలో చెక్ చెప్పారు. అందరూ బుద్ధిగా ప్రవర్తించాలని లేకుంటే వేటు తప్పదని స్మూత్ గా హెచ్చరించారు. ప్రజలు కూటమి సర్కార్ పై నమ్మకముంచి గెలిపించారని.. లేదంటే మీరంతా ఎక్కడుండేవారు గుర్తుచేసుకోవాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, తాను, పవన్ కల్యాణ్.. కలిసికట్టుగా సాగుతుంటే.. మీరు మాత్రం లేనిపోని వివాదాలతో కాలం గడుపుతున్నారని హెచ్చరించారు.చంద్రబాబు అసెంబ్లీ వేదికగానే ఎమ్మెల్యేలకు ఏకమొత్తంగా క్లాస్ ఇచ్చేశారు. ఎవరికివారు తామే బలవంతులం అనుకుంటున్నారని, అలా అయితే 2019లో ఎందుకు పరాజయం పాలయ్యారో ఆలోచించుకోవాలని చురకలు అంటించారు. తాను, పవన్ కళ్యాణ్, మోడీ ముగ్గురు కలిస్తేనే ప్రజలు విశ్వసించి ఓట్లేశారని, ఈ కూటమి సజావుగా సాగేందుకు నాయకులు కూడా కలిసి ఉండాలని తేల్చి చెప్పారు. అంతేకాదు, ఎవరైనా తమకు సొంత బలం ఉంటుందని అనుకుంటే తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.కూటమిలో ఉన్న పవన్, మోడీ, తాను ప్రజలకు మరింత చేరువ అవుతున్నామని, క్షేత్రస్థాయిలో నాయకులు కీచులాడుకోవడం వస్తే అది వారికే నష్టమని వ్యాఖ్యానించారు. కలివిడిగా ఉంటేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలని అన్నారు. అలాకాదని అనుకుంటే అప్పుడు తెలుస్తుందని పరోక్షంగా హెచ్చరించారు. కూటమిగా ఉండాల్సిన అవసరం అందరికీ ఉంటుందని వ్యాఖ్యానించారు.నేతలు తమంత వారు లేరని భావిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వివాదాలు కూడా అదేవిధంగా కొనసాగుతున్నాయి. గతం నుంచి వివాదాలకు దిగుతున్న నేతలు కొందరు అయితే, కొత్తగా మరికొందరు వివాదాలకు కేంద్రంగా మారుతున్నారు. దీంతో పైస్థాయిలో కూటమి నాయకుల మధ్య ఐక్యత ఉన్నప్పటికీ, గ్రౌండ్ లెవెల్లో మాత్రం ఒకింత ఇబ్బందికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

# మూసీలో పొంగుతున్న రాజకీయ కాలుష్యం




హైదరాబాద్, మార్చి 11, హైదరాబాద్‌కు ఇప్పుడు కొత్త జ్వరం పట్టుకుంది. అదే.. 'మూసీ ఫీవర్'. నదిని శుద్ధి చేస్తామని ఒకరు అంటే, ఆ ప్రాజెక్టు వెనుక 'అతివృష్టి' (అవినీతి) ఉందని మరొకరు, అసలు తాము వస్తే మూసీని 'అమృతం'లా మార్చేవాళ్ళమని ఇంకొకరు.. మొత్తానికి మూసీ నీళ్ళ కంటే, మూసీపై జరుగుతున్న రాజకీయ కాలుష్యమే ఇప్పుడు సిటీలో హాట్ టాపిక్.మన రాజకీయ నాయకులకు ఏదైనా ప్రాజెక్టు అంటే మొదట గుర్తొచ్చేది 'విగ్రహం'. మూసీ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 5,000 కోట్లు దాటినా, ప్రతిపక్షాలకు మాత్రం అందులో కనిపించేది కేవలం ఒక విగ్రహం మాత్రమే! "అమ్మో! విగ్రహానికి వంద కోట్లా?" అంటూ ఒక వర్గం గగ్గోలు పెడుతుంటే, అటువైపు ప్రభుత్వం ఏమో "మేము చేసేది నది ప్రక్షాళన, విగ్రహం ఒక్కటే కాదు" అని వివరణ ఇచ్చుకోలేక పడుతున్న పాట్లు చూస్తుంటే.. అసలు ప్రాజెక్టు దేనికో, అది దేనికో అర్థం కాక సామాన్యుడు తల పట్టుకుంటున్నాడు.సీఎం రేవంత్ రెడ్డి గారి ఉద్దేశం చూస్తుంటే, హైదరాబాద్‌ను లండన్ థేమ్స్ నది రేంజ్‌లోకి తీసుకెళ్లాలని ఉంది. "సబర్మతిని అభివృద్ధి చేయొచ్చు, యమునను బాగు చేయొచ్చు.. మరి మన మూసీని ఎందుకు చేయకూడదు?" అని ఆయన అడుగుతుంటే, ప్రతిపక్షాలు "మీరు చేసేది అభివృద్ధి కాదు, 'లూటిఫికేషన్'" అని ఎదురుదాడి చేస్తున్నాయి. చివరకు పరిస్థితి ఎలా ఉందంటే, మూసీలో నీళ్లు పారడం సంగతి పక్కన పెడితే, మాటల యుద్ధం మాత్రం వరదలా పారుతోంది.ఏ రాజకీయ గొడవైనా చివరకు 'లీగల్ నోటీసుల' దగ్గర ఆగుతుంది. ప్రాజెక్టుపై ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నేతలకు ఏకంగా లీగల్ నోటీసులు రావడంతో.. ఇప్పుడు అసలు పోరాటం 'వాస్తవాల' మీద జరుగుతుందా లేక 'కోర్టు మెట్ల' మీద జరుగుతుందా అనే అనుమానం రాక మానదు. ఆరోపణలు చేయడం, నోటీసులు రావడం, మళ్లీ ప్రెస్ మీట్లు పెట్టడం.. ఇదంతా చూస్తుంటే హైదరాబాద్ అభివృద్ధి ఏమో కానీ, లాయర్ల ఆదాయం మాత్రం ఖచ్చితంగా పెరిగేలా ఉంది! అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డిగారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. ప్రభుత్వం తన వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఫెయిల్ అయ్యిందనే విమర్శలకు, ఈ ప్రజెంటేషన్ చెక్ పెడుతుందా? లేక ఆ ప్రజెంటేషన్‌ను చూసి ప్రతిపక్షాలు మరో రకమైన విమర్శలకు సిద్ధమవుతాయా? అన్నదే అసలైన సస్పెన్స్.నది కలుషితమైతే నీటిని శుద్ధి చేయొచ్చు. కానీ, రాజకీయాల్లో కలుషితమైన అభిప్రాయాలను శుద్ధి చేయడానికి ఏ ప్లాంట్ పనికొస్తుంది? కేవలం విగ్రహాలు, విమర్శల చుట్టూ తిరిగితే, మూసీ ప్రక్షాళన అనేది నగరానికి ఒక 'స్వప్నం'గానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చెప్పే 'గ్లోబల్ సిటీ' కల నెరవేరాలంటే, ప్రజలకు కావాల్సింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు మాత్రమే కాదు.. పారదర్శకమైన పాలన, క్షేత్రస్థాయిలో భరోసా!

# రంజాన్ మాసం సహనం, దానం, సహోదర భావానికి ప్రతీక:

## బోయిన్ పల్లి ఇఫ్తార్ విందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ నియోజకవర్గం లోని బోయిన్ పల్లి కడక్ పుర ప్రాంతం లోని నేతాజీ నగర్ లో సయ్యద్ అమీర్ గారి ఆధ్వర్యంలో గత 14 ఏళ్ళుగా నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం హాజరయ్యారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నిష్ఠగా ఉపవాస దీక్ష చేస్తారని, భారతదేశంలో సర్వ మతాలు సమానమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఈ పవిత్ర దినాల ముఖ్య ఉద్దేశం అందరూ దాన, సహన, సహోదర భావ గుణాలతో ప్రవర్తించాలని చెప్పారు. ఇన్నేళ్ళుగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్న అమీర్ భాయ్ ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెంట కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, మారుతి గౌడ్,బల్వంత్ రెడ్డి, అరుణ్ యాదవ్, ప్రభు గుప్త, హైదర్, రియాజుద్దీన్, సదానంద్ మరియు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# యుద్ధం ఎఫెక్ట్...
# మామిడి రైతుల విలవిల

విజయవాడ, మార్చి 11, దేశ విదేశాల్లో తెలుగు వాళ్లు ఎక్కడున్నా మార్చి నెల రాగానే మామిడి కాయలే గుర్తొస్తాయి. తెలుగు వాళ్లే కాదు.. విదేశీయులు కూడా మన మ్యాంగోల కోసం ఎదురు చూడాల్సిందే..! ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రతి ఏటా విదేశాలకు టన్నుల కొద్దీ మామిడి ఎగుమతి అవుతూ ఉంటుంది. అందులోనూ.. కృష్ణా జిల్లా నూజివీడు మామిడికి ఫుల్ డిమాండ్.. నూజివీడు రసాలు పేరు చెప్తే నోరూరాల్సిందే.. అందుకే.. ఇక్కడి నుంచి దేశ విదేశాలకు మన మామిడి ఎగుమతి అవుతుంది. దేశ విదేశాల్లోనూ మన మామిడి మస్తు గిరాకీ ఉండడంతో వ్యాపారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. అయితే.. ఇదంతా గతేడాది వరకు.. ఇప్పుడు సీన్ మారిపోయింది. నూజివీడు మామిడి దిగుబడి భారీగా వచ్చే అవకాశం ఉన్నా.. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వార్ కారణంగా ఎగుమతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఎగుమతి దారులకు ఈసారి ఆర్డర్స్ భారీగా ఉన్నాయి. కానీ.. ఇరాన్, ఇజ్రాయెల్ వార్.. మామిడి ఎగుమతిపై తీవ్ర ప్రభావం పడుతుండడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే.. అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలకు మామిడి పండ్లు ఎక్కువగా ఆకాశ మార్గంలోనే ఎగుమతి అవుతుంటాయి. కానీ.. యుద్ధం కారణంగా ఇప్పటికే.. కొన్ని ఫ్లైట్స్ రద్దు కావటం, కొన్ని ఎయిర్‌వేస్‌లు ఛార్జీలు పెంచడం లాంటి పరిణామాలు ఇబ్బందిగా మారుతున్నాయి. ఆయా దేశాల్లో మామిడికి భారీగా డిమాండ్ ఉన్నా.. దానికి తగ్గట్టుగా ఎగుమతి చేయలేకపోతున్నామని ముంబైకి చెందిన ఎక్స్‌పోర్ట్ నిర్వాహకులు సమీర్ చెప్తున్నారు.వార్ ఎఫెక్ట్ నూజివీడు మామిడికి ఇబ్బందులు తెచ్చి పెడితే.. మహబూబ్‌నగర్ జిల్లా మామిడి రైతులను తెగుళ్లు సర్వనాశనం చేస్తున్నాయి. తీపి ఫలాలు పండించే కొల్లాపూర్ మామిడి రైతులకు నాలుగేళ్లుగా చేదు ఫలాలు ఎదురవుతున్నాయి. ప్రతికూల వాతావరణం, పలు రకాల తెగుళ్ల కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. కాయలతో నిండుగా కనిపించాల్సిన మామిడి చెట్లు.. వాడిపోయిన పూతలతో దర్శనమిస్తున్నాయి. ఎకరాలకు ఎకరాలు కాత, పూత లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లక్షల పెట్టుబడితో ఏడాదంతా సాగు చేస్తే.. చివరికి చీడ, పీడలతో కూడిన చెట్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ మామిడికి ప్రతి ఏటా ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఈ ఏడాది సుమారు 35వేల ఎకరాల్లో మామిడి పంట పండింది. నేల స్వభావం, నీటి లక్షణాలతో కొల్లాపూర్ మామిడికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. దేశీయంగా ఎంతో గుర్తింపు ఉన్న కొల్లాపూర్ మామిడి.. అమెరికా, మలేషియా, అరబ్, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతుంది. కానీ.. గత నాలుగేళ్లుగా కొల్లాపూర్ మామిడి రైతులను తెగుళ్ల కష్టాలు వెంటాడుతున్నాయి. నల్లతామర, తేనేమంచు, బూడిద తెగుళ్లు మామిడి పూతను పట్టి పీడిస్తున్నాయి. వాతావరణ మార్పులతో పూత, కాత దెబ్బ తినడం మామిడి రైతులకు ఇబ్బందిగా మారింది.మొత్తంగా.. ఒకవైపు.. కృష్ణా జిల్లా నూజివీడు మామిడికి ఇజ్రాయెల్-ఇరాన్ వార్ శనిలా మారితే.. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మామిడిని తెగుళ్లు, వాతావరణ మార్పులు పట్టి పీడిస్తు?న్నాయి. ఫలితంగా.. మామిడి రైతులను ఆదుకునేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు

# 400 కోట్లతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టు

హైదరాబాద్, మార్చి 11, మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం బాపూఘాట్ వద్ద రూ. 400 కోట్లతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టు సంబంధించిన డీపీఆర్ రెడీ అయింది. 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం, మ్యూజియం, 'లండన్ ఐ' తరహాలో చరఖా రంగుల రాట్నం ఈ ప్రాజెక్టు ప్రధాన ఆకర్షణలు. మూసీ నదిపై 15 వంతెనలు, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్, పర్యాటక హంగులను ఏర్పాటు చేస్తూ డీపీఆర్ సిద్ధం చేశారు.హైదరాబాద్ నగర నడిబొడ్డున ప్రవహించే మూసీ నదిని అందంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

మురుగు, వ్యర్థాలతో ప్రవహిస్తున్న మూసీ నదిని ప్రపంచ స్థాయి పర్యాటక, ఆర్థిక కేంద్రంగా మార్చటమే లక్షంగా సర్కార్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టింది. ఈ చర్యలో భాగంగా.. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌ను సైతం చేపడుతోంది. ఈ మేరకు తాజాగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీపీఆర్‌ను సిద్ధం చేసింది. బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మూసీ నదికి రెండు వైపులా విశాలమైన రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు ఏర్పాటు కానున్నాయి.బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 60 ఎకరాల భూమి భూమి ఉంది. ఇందులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది. 100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, మ్యూజియం, గాంధీ చరిత్రపై ప్రదర్శనశాల, కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఈ టవర్‌పై 35-50 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. గాంధీ విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటు చేయనున్నారు. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను తలపించేలా ఈ నిర్మాణం కనిపించనుంది. పక్కనున్న 98 ఎకరాల డిఫెన్స్ భూములను సేకరించే ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు.మూసీలో నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటుగా నదికి రెండు వైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మె?త్తంగా 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు.

దాంతో పాటుగా కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు. నదిలో పూడికను తొలగించి, అంచులను సరిచేసి కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. పిల్లల పార్కులు, హోటళ్లు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం కానున్నాయి. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ కూడా నిర్మిస్తారు. గాంధీ సరోవర్‌లో బోటింగ్ సదుపాయం కూడా ఉండనుంది.

# ఆ రెండు జిల్లాలకు కేంద్రం తీపి కబురు

వరంగల్, మార్చి 11, ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద తెలంగాణలోని వరంగల్‌కు 100, నిజామాబాద్‌కు 51 చొప్పున మొత్తం 151 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం కేటాయించింది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్ సాహు రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. అయితే, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రస్తుతానికి ప్రతిపాదనలు అందలేదని కేంద్ర మంత్రి టోకన్ సాహు వెల్లడించారు. విద్యుత్ సౌకర్యాలు, ఇతర నిర్మాణాలు పూర్తయిన తర్వాతే ఈ బస్సులు క్షేత్రస్థాయికి చేరుతాయని ఆయన స్పష్టం చేశారు.వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు గుడ్‌న్యూస్. ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద తెలంగాణకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించారు. వరంగల్‌కు 100, నిజామాబాద్‌కు 51 మె?త్తంగా 151 విద్యుత్తు బస్సులు మంజూరు చేసినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్ సాహు వెల్లడించారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు.ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద నిధుల కేటాయింపు అనే విషయం ఈ-బస్‌లకు అనుబంధమైన మౌలిక వసతుల అభివృద్ధి కోసం రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ ద్వారా ప్రతిపాదనలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. అందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనలూ అందలేదని మంత్రి టోకన్ సాహూ స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేటాయించిన బస్సుల్లో ఇప్పటివరకూ ఒక్కటి కూడా అక్కడికి తరలించలేదని చెప్పారు. ఈ బస్‌ల నిర్వహణకు అవసరమైన నిర్మాణ, విద్యుత్తు పరమైన మౌలికవసతుల అభివృద్ధి తర్వాతే వాటిని క్షేత్రస్థాయికి తరలించనున్నట్లు వెల్లడించారు.ఇక 2022-25 మధ్య కాలంలో వరంగల్‌కు 3.52 లక్షల మంది, గోల్కొండకు 47.41 లక్షల మంది, చార్మినార్‌కు 35.85 లక్షల మంది పర్యాటకులు వచ్చినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. సందర్శకులకు టికెట్ల విక్రయం ద్వారా గత మూడేళ్లలో గోల్కొండ నుంచి రూ.15.30 కోట్లు, చార్మినార్ నుంచి రూ.9.30 కోట్లు, వరంగల్ నుంచి రూ.73.71 లక్షల ఆదాయం వచ్చినట్లుగా వెల్లడించారు.కాగా, ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసున్నప్పటి నుంచి బస్సులు ఖాళీగా ఉండటం లేదు. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు రాష్ట్రంలో ఏ మూల నుంచి ఏమూలకైనా ఫ్రీ జర్నీ ఉండటంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. గతంలో హైదరాబాద్ సిటీ బస్సుల్లో మాత్రమే రద్దీ ఉండేది. ప్రస్తుతం జిల్లా బస్సుల్లోనూ రద్దీ పెరిగింది. తాజాగా కేంద్రం ప్రకటించిన బస్సులతో రద్దీ తగ్గే ఛాన్సుంది. దాంతో పాటు ప్రయాణికుల ప్రయాణం మరింత సాఫీగా సాగుతుంది.

# గంజాయి కేసులో నిందితుడు అరెస్టు



మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ ఎక్సైజ్ పిఎస్ పరిధి పర్వతాపూర్ రోడ్డులో గంజాయి విక్రయాలు జరుపుతున్న కుమ్మరి గోపి అనే వ్యక్తిని అదుపులోకి ఎస్.టి.ఎఫ్ టీం అదుపు లోకి తీసుకుంది. నిందితుడు కుమ్మరి గోపి వద్ద 1.3 కేజీల గంజాయి స్వాధీనం. చేసుకుంది. నిందితుడిని గంజాయిని ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కి అప్పగించింది. ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా రిమాండ్ కి తరలించారు.

# 12 నైట్ ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి

హైదరాబాద్, మార్చి 11, తెలంగాణలో సాయంత్రం పూట బీటెక్ చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఉన్న 12 ఇంజనీరింగ్ కాలేజీల్లో పలు రకాల బీటెక్ కోర్సులను సాయంత్రం పూట చెప్పనున్నారు. గత కొంతకాలంగా ఈ సాయంత్రం బీటెక్ కోర్సులకు సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. తాజాగా తుది ఆమోదం లభించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ఇచ్చేందుకు అనుమతినిచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయానికి ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రంలో విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విద్యా శాఖను తన వద్దే ఉంచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విద్యా శాఖకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణలో 12 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సాయంత్రం బీటెక్ కోర్సులను అందించే నిర్ణయానికి రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత కొన్ని నెలలుగా ఈ సాయంత్రం ఇంజినీరింగ్ కోర్సుల ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండగా.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ విద్యా శాఖ జీఓ నంబర్ 30ని జారీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 కాలేజీల్లో ఈ ఈవెనింగ్ బీటెక్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కాలేజీకి 1 నుంచి 5 కోర్సులు చెప్పేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఇక ఒక్కో కోర్సులో తక్కువలో తక్కువగా 15 సీట్లు.. ఇక అత్యధికంగా 60 సీట్లకు అవకాశం కల్పించారు. ప్రస్తుత 2026-27 విద్యా సంవత్సరం నుంచే ఈ కాలేజీల్లో ప్రవేశాలు జరుపుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష నిర్వహించి సీట్లను భర్తీ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసి.. కనీసం ఏడాది పాటు ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నవారు ఈ బీటెక్ కోర్సుల్లో చేరొచ్చని అధికారులు వెల్లడించారు. ఒకవేళ ఇప్పటికే బీటెక్ కోర్సు పూర్తి చేసిన వారు ఎంటెక్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందొచ్చు. ఇలా చేరిన వారికి సాయంత్రం వేళ తరగతులను నిర్వహించనున్నారు. ఈ సాయంత్రం కోర్సులకు కూడా రెగ్యులర్ కోర్సులకు ఖరారు చేసిన ఫీజునే చెల్లించాల్సి ఉంటుంది.2024లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈసెట్ కన్వీనరే ఈ పరీక్షను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే రాష్ట్ర ఉన్నత విద్యామండలి కూడా ఈసెట్ కన్వీనర్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య చంద్రశేఖర్‌కు ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. ఎంటెక్ సీట్ల భర్తీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయగా.. అయితే వాటిని ఎలా భర్తీ చేస్తారు అనే దానిపై మాత్రం ఇంకా స్పష్టత లేదు. అయితే 3, 4 కాలేజీల్లోనే సాయంత్రం ఎంటెక్ కోర్సులకు అనుమతులు వచ్చాయి.

సాయంత్రం బీటెక్ కోర్సులకు అనుమతి పొందిన కాలేజీలు

- చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)
- వల్లూరుపల్లి నాగేశ్వరరావు విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి)
- మాటూరి వెంకట సుబ్బారావు ఇంజినీరింగ్ కాలేజీ (ఎంవీఎస్ఆర్)
- స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (స్టాన్లీ)
- మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (మెథడిస్ట్)
- మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)
- మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీ
- అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలాజికల్ సైన్సెస్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేపలగడ్డ)
- జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (మహబూబ్‌నగర్)
- అనుబోస్ ఇన్‌స్టిట్యూ?ట్ ఆఫ్ టెక్నాలజీ (ఖమ్మం జిల్లా పాల్వంచ)
- సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం)
- సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కాలేజీ (మేడ్చల్ జిల్లా)

# మరింత విస్తరించనున్న ఐటీ కారిడార్

హైదరాబాద్, మార్చి 11, హైదరాబాద్ నగరం దేశంలోనే ఐటీ క్యాపిటల్‌గా ఎదుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అత్యాధునిక మౌలిక వసతులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం కారణంగా ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు తమ ప్రధాన కార్యాలయాలను ఇక్కడ నెలకొల్పాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి సంస్థలు హైదరాబాద్ నగరాన్ని తమ కేంద్రంగా ఎంచుకున్నాయి. హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలలో విస్తరించిన ఈ ఐటీ కారిడార్‌లో లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉద్యోగాలు చేస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ వంటి మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు రెడీ అవుతున్నాయి.రాజధాని హైదరాబాద్‌లో ఐటీ కారిడార్ పరిధిని విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే ఉన్న హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రాం గూడలతో పాటు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో మరిన్ని ఐటీ సంస్థలు, క్లస్టర్ల ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ మేరకు కంపెనీల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు టీజీఐఐసీ సన్నాహాలు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం గచ్చిబౌలి సమీపంలో టీజీఐఐసీ ఆధీనంలోని ప్రభుత్వ భూములను వేలం వేయగా ఎకరా రూ.170 కోట్లకుపైగా అమ్ముడుపోయింది. దీంతో ఐటీ కారిడార్‌ను విస్తరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

నగర శివారులోని ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు కొందరు అక్రమార్కులు రికార్డులను మార్చేసినట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న గ్రామాలు, వ్యవసాయ భూముల్లో 60 శాతం నిజాం నవాబు హయాంలో దానమిచ్చిన భూములే. నిజాం వారసులు లేకపోవడం, భూములకు సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు పక్కాగా క్రమపద్ధతిలో రూపొందించడంతో వీటిలో 90 శాతం ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఆయా భూములను సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు.

నిజాం వారసుల నుంచి దానం పొందామని, వారు జీపీఏ ఇచ్చారంటూ నకిలీ పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

శేరిలింగంపల్లి మండలంలోని 3 గ్రామాల్లో 180 ఎకరాల ప్రభుత్వ భూములపై ప్రస్తుతం వివాదాలు కొనసాగుతున్నాయి. గండిపేట మండలంలోని 4 గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల భూములపై ప్రైవేటు వ్యక్తులు వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములు, చెరువులను అక్రమార్కుల నుంచి రక్షించేందుకు అధికారులు డిజిటల్ సర్వేలు చేయిస్తు?న్నారు. త్వరలోనే ఆ భూములను స్వాధీనం చేసుకొని ఆయా ప్రాంతాల్లో ఐటీని విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మండల ఎన్నికలకు సిద్ధం

అదిలాబాద్, మార్చి 11, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రభుత్వ పాలనకే పరిమితం కాకుండా పార్టీ యంత్రాంగాన్ని యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేసే పనిలో పడింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకున్న అధిష్టానం, పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే మండల స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది.పార్టీని గాడిలో పెట్టేందుకు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పష్టమైన డెడ్‌లైన్లను విధించారు. మార్చి 15 నాటికి మండల అధ్యక్షుల ఎంపిక, మండల కమిటీల ఏర్పాటు పూర్తి కావాలని ఆదేశించారు. మార్చి 25 నాటికి మొత్తం మండల స్థాయి కమిటీల నియామక ప్రక్రియ ముగియాలి. అలాగే మార్చి 30 నాటికి గ్రామ పంచాయతీ, పట్టణ అధ్యక్షులు, వారి కమిటీల ఎంపిక పూర్తి కావాలని నిర్దేశించారు.ఈ సంస్థాగత మార్పులకు వికారాబాద్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ప్రధాన కారణంగా చెప్పొచ్చు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులతో ముఖాముఖి చర్చించడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సామాజిక అంశాలు, ప్రభుత్వ విధానాలపై నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వడం వల్ల డీసీసీ అధ్యక్షులకు తమ జిల్లాల్లో పార్టీని ఎలా నడిపించాలో ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లభించింది. అదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ పేర్కొన్నట్లుగా, ఈ శిక్షణ నాయకత్వ లక్షణాలను మెరుగుపరచడమే కాకుండా, క్షేత్రస్థాయి నాయకులతో అగ్ర నాయకత్వం నేరుగా మమేకమయ్యేలా చేసింది.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే కాంగ్రెస్ ప్రాథమిక లక్ష్యంగా ఈ సంస్థాగత మార్పులు, చేర్పులు చేస్తున్నట్టు సమాచారం. మండల స్థాయిలో కమిటీలు బలంగా ఉంటేనే ఓటర్లను నేరుగా చేరుకోవడం సాధ్యమవుతుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలన్నా, స్థానికంగా పార్టీ పట్టు కోల్పోకుండా ఉండాలన్నా మండల స్థాయి నాయకత్వం కీలకం. కొత్తగా నియమితులయ్యే మండల అధ్యక్షులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఆహ్వానించి, మెరిట్ ప్రాతిపదికన ఎంపికలు జరపడం ద్వారా పార్టీలో అంతర్గత అసమ్మతిని తగ్గించాలని అధిష్టానం భావిస్తోంది. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తుండటం వల్ల పారదర్శకత పెరుగుతుంది.కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ మండల స్థాయి పునర్వ్యవస్థీకరణ కేవలం పదవుల భర్తీ మాత్రమే కాదు. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2028 ఎన్నికలకు బలమైన పునాది వేస్తుందని అంచనా వేస్తున్నారు. కేడర్‌లో జవజీవాలు నింపడం ద్వారా ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడమే కాకుండా, అధికార పార్టీగా తన బలాన్ని నిరూపించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. మార్చి 30 నాటికి ఈ ప్రక్రియ పూర్తయితే, ఏప్రిల్ నుండి తెలంగాణ కాంగ్రెస్ సరికొత్త ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో కనిపించే అవకాశం ఉంది.

## అదుపుతప్పి బోల్తా పడి
## వాగులోకి దూసుకు వెళ్లిన కారు

పల్నాడు దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నల్లవాగు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడి వాగులోకి దూసుకెళ్లింది. అద్దంకి నార్కెట్పల్లి హైవే రహదారిపై హైదరాబాదు వైపు నుండి వస్తూ తిరుపతి వెళుతున్న కారు అదుపుతప్పి నల్లవాగు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద సమయంలో కారులో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని అత్యవసర చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.



## కల్తీ పాల ఘటన మూడేళ్ల చిన్నారి మృతి

రాజమండ్రి కల్తీ పాల ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి మృతి చెందాడు. 23 రోజులుగా మృత్యువుతో పోరాడి జయకృష్ణ (3) ప్రాణాలు విడిచాడు. దాంతో కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య 123 కు చేరింది. జయకృష్ణ మృతితో తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## పొంగులేటిని వెంటాడుతున్న గులాబీ దళం

ఖమ్మం, మార్చి 11, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని గులాబీ పార్టీ నేతలు వెంబడిస్తున్నారు. వదల బొమ్మాళి అన్నట్టుగా ఆయన గురించి రకరకాల ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే శ్రీనివాసరెడ్డి కుమార్ రెడ్డి మీద ఆరోపణలు వచ్చాయి. ఆయన సింగపూర్ నుంచి నిషేధిత వస్తువులను దిగుమతి చేసుకున్నారని విమర్శలు వినిపించాయి.ఈ సంఘటన తర్వాత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద గులాబీ పార్టీ తీవ్రంగా దృష్టి సారించింది. అప్పట్లో ఆయన కంపెనీల మీద ఐటి అధికారులు దాడులు చేసిన నేపథ్యంలో.. ఈ వ్యవహారాన్ని గులాబీ పార్టీ తీవ్రంగా ప్రచారం చేసింది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ముసలం తెస్తున్నారని ఆరోపణలు చేసింది. సరిగ్గా దీపావళికి ముందు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గులాబీ పార్టీ నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ నేతల అక్రమాలకు సంబంధించి ఆటం బాంబులు పేలబోతున్నాయని హెచ్చరించారు. అయితే పొంగులేటి చేసిన వ్యాఖ్యలు తగ్గట్టుగా సంచలన వ్యవహారాలు ఏవీ వెలుగులోకి రాలేదు.ఇక ఇప్పుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించి ఒక కీలక విషయాన్ని గులాబీ నేతలు బయటికి తీసుకొచ్చారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ అక్రమంగా కంకర క్రషింగ్ చేపడుతోందని ఆరోపించారు. గులాబీ నేతలు దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, క్రిశాంక్ రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ నిర్వహిస్తున్న క్రషర్ వద్దకు వెళ్లారు. కొండలను మొత్తం పొంగులేటి కంపెనీ పిండి చేస్తోందని మండిపడ్డారు.గులాబీ నేతల ఆరోపణల నేపథ్యంలో పొంగులేటి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న రాఘవ కంపెనీ వివరణ ఇచ్చింది. తాము నిబంధనలకు వ్యతిరేకంగా ఏ పనీ చేయడం లేదని పేర్కొంది. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే క్రషర్ నిర్వహిస్తున్నామని పేర్కొంది. గులాబీ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని.. ఆ విమర్శలు మొత్తం సత్య దూరమని స్పష్టం చేసింది. అడ్డగోలుగా ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు జారీ చేస్తామని పేర్కొంది.

## కస్తూర్బా పాఠశాలలు నిర్లక్ష్యపు నీడ

మహబూబ్ నగర్ , మార్చి 11, నాగర్ కర్నూల్ జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలు నిర్లక్ష్యపు నీడన కొనసాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరుగుతోంది. దీంతో కస్తూర్బా పాఠశాలలకు విద్యార్థులు చేరుతున్న వారి సంఖ్య క్రమంగా పెరిగింది. పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన బా లికలు అత్యధిక శాతం 10, ఆ తర్వాత ఇం టర్ ఉన్నత చదువులకు కస్తూర్బాలు వేదికగా మారుతున్నాయి. దానికి తోడు ప్రభు త్వాలు కూడా నాణ్యమైన విద్యతోపాటు భోజనం కూడా అందించాలన్న ఉద్దేశంతో మెనూ పకడ్బందీగా అమలు చేయాలని భా రీగా నిధులు కేటాయించింది.

ఇంతవరకు బాగానే ఉన్నా ప్రైవేటు పాఠశాల ఉత్తీర్ణత శాతం హాజరు శాతం క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో కొంతమంది బడి దొంగలు, ఉన్నత వర్గాలకు చెందిన కస్తూర్బా పాఠశాల టీచర్లు, ప్రత్యేక అధికారులు క్రమంగా కస్తూ ర్బా పాఠశాలల ప్రాధాన్యత తగ్గించాలన్న కుట్రకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులను వారి సామర్థ్యాల ను ఎప్పటికప్పుడు పరిశీలించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యను అందించాల్సిన బాధ్యత ఉంది.దాంతోపాటు మెరుగైన భోజనం అందించేందుకు మెనూ పకడ్బందీ అమలుపరిచేలా పర్యవేక్ష ణ చేయాల్సి ఉంది.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి మెరుగుప రిచేందుకు రక్తహీనత నుండి కాపాడేందుకు తరచూ వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇవన్నీ పర్యవేక్షించాల్సిన కొంతమంది అధికారులు ఉన్నత వర్గాల వారితో, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు కొమ్ముకా స్తూ కస్తూర్బా పాఠశాలల పర్యవేక్షణ గాలికి వదిలేసారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రైవేటు పాఠశాలల నుండి తరచు ముడుపులు ముట్టజెప్పే వ్యక్తుల మాటలు నమ్మి జి ల్లా విద్యాశాఖ అధికారులు సైతం పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. దానికి తోడు అనుకూలంగా ఉన్న ప్రత్యేక అధికారు లు, సిఆర్టి లను గూడచారి వ్యవస్థగా ఏర్పా టు చేసుకొని వారికి అనుకూలంగా వ్యవహరించే వారికి అందలమెక్కిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేసే వారిని టార్గెట్ చేసి మరీ హింసకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.దీనికి తోడు విద్యార్థులకు అందించాల్సిన భోజనం పంపిణీ చేసే సరుకుల విషయంలో ఎక్కువ శాతం పంపిణీ చే సినట్లు రికార్డులు ఎక్కించి, చేయని పనులకు నకిలీ బిల్లులు సృష్టించి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తీవ్ర విమర్శలు ఉ న్నాయి. జిల్లా డీఈవో కార్యాలయంలో కొం తమంది అక్రమంగా డిప్యూటేషన్ పై చొరబడి ఇలాంటి బడి దొంగలకు బద్ధకస్తులకు వంత పాడుతున్న వారు కూడా లేకపోలేదని విమర్శలున్నాయి. కొంత కాలంగా కస్తూర్బా పాఠశాలలో తరచూ అవినీతి అక్రమాలు, నెలల తరబడి పాఠశాలకు వెళ్లకపోయినా న కిలీ హాజరు రిజిస్టర్లు నమోదు చేస్తూ తప్పించుకు తిరిగారిగిన వారు ఉన్నారు. విద్యార్థులు స్నానం గదుల్లోకి వెళ్లి వీడియో రికార్డులు చేసి ఇతరులకు పంపిన టీచర్లపై కూడా చర్యలకు వెనుకబడిన పరిస్థితి. తిమ్మాజిపేట మండలం కస్తూర్బా పాఠశాలలో సీఆర్పీలు ప్రత్యేక అధికారుల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతున్నప్పటికీ విద్యాశాఖ అ ధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు వారి మధ్య నలిగిపోతున్నారు. తాజా గా నాగర్ కర్నూల్ జిల్లాలోని ఓ కస్తూర్బా పాఠశాలలో సుమారు 9 నెలల పాటు గ ర్భం దాల్చిన బాలిక అక్కడే ఉన్నప్పటికీ గుర్తించలేకపోయారు. చివరికి ప్రసవం అనంతరం ఈ ఘటన వెలుగులోకి రాగా సుమా రు వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ సదరు కస్తూర్బా పాఠశాల బాధ్యులపై చర్యలకు వెనకడుగు వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. సుమారు బద్ధకస్తులు, బడి దొంగలు పనిచేస్తున్న పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు దాదాపు కొల్లాపూర్ నియోజకవర్గంలోనే అ ధికంగా ఉన్నాయని బాహాటంగా విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ ప్రాంతంలోనే వరుస ఘటనలు చోటు చేసుకున్న పరిస్థితి. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని కేవలం ప్రచారాలు ప్రకటనలకే పరిమి తం అవుతున్నారని ఈ వరుస ఘటనలతో మరోసారి రుజువైంది.9 నెలల పాటు స దురు పాఠశాలలోనే ఉన్న బాలికను కనీసం తోటి బాలికలు, క్లాస్ టీచర్లు, వైద్య పరీక్షలు అందించే వైద్య సిబ్బంది, భోజనం అందించే వంట ఏజెన్సీలు, చివరగా పర్యవేక్షణ చేయాల్సిన ప్రత్యేక అధికారి, జిల్లా అధికారి సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేటతెల్లమైంది. ఈ ఘటన జరిగిన వెంటనే విచారణ కోసం వచ్చిన రాష్ట్ర ఉన్నతాధికారుల ముందే మరోసారి నిర్లక్ష్యం బయటపడింది. ఉడికి ఉడకని అన్నం వడ్డించి తమ నిర్లక్ష్యాన్ని అధికారి ముందే రుజువు చేసుకున్నారు.అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ కి అందించగా ఇప్పటి వరకు సదరు అధికారులపై, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు మాత్రం జంకుతున్న పరిస్థితి. దీని వెనక రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెర వెనుక కాపాడుతున్నారా తన పేరు చెప్పుకొని కిందిస్థాయినేతలే కాపాడుతున్నారా అ న్న అనుమానాలు సర్వత్ర వ్యక్తమవుతున్నా యి. కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిని ఉన్నత వర్గానికి చెందినవారు కావడంతోనే ఆ వర్గం రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడుతోందని విమర్శలు ఉన్నాయి.

## కమాన్ చౌరస్తాలో మంత్రి పొన్నం పర్యటన



కరీంనగర్ కమాన్ చౌరస్తా వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో మంత్రి పొన్నంప్రభాకర్ పాల్గొన్నా. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తో కలిసి పలు హోటల్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హోటల్ లలో ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించరాదని, స్టీల్ వస్తువులు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ , పలువురు కార్పొరేటర్లు ,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు..

## కృష్ణానదిలో ఇద్దరు బాలురు గల్లంతు

సూర్యాపేట జిల్లాలో ఆందోళనకర ఘటన చోటు చేసుకుంది. హుజూర్ నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం మండలం చింత్రియాల గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు కృష్ణా నదిలో గల్లంతయ్యారు.. చేపల వేట కోసం నదికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు కలిసి నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.అయితే బాలురు ఎలా గల్లంతయ్యారు? వారి పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

## ఒంగోలులో ఆటో డ్రైవర్ నిజాయితీ.. రూ.30 లక్షల బంగారం అప్పగింత..



ఒంగోలు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. ప్రయాణికులు ఆటోలో మర్చిపోయిన సుమారు రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను పోలీసులకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. ఈ ఘటనతో ఆటో డ్రైవర్పై ప్రశంసల వర్షం కురుస్తోంది. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన సుబ్బారావు తన కుటుంబంతో కలిసి ఒంగోలు వచ్చారు. ఈ క్రమంలో ఓ ఆటో ఎక్కి గమ్యస్థానంలో దిగారు. అయితే, హడావిడిలో రూ.30 లక్షల విలువైన బంగారు నగలు ఉన్న బ్యాగును ఆటోలోనే మర్చిపోయారు. కాసేపటికి విషయం గుర్తించిన సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరోవైపు ప్రయాణికులు దిగి వెళ్లిన తర్వాత ఆటో డ్రైవర్ నాగేశ్వరరావు తన వాహనంలో బ్యాగును గమనించారు. అది తన ఆటోలో ప్రయాణించిన వారిదేనని భావించి, వారి కోసం సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో నేరుగా ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు వెళ్లి బ్యాగును పోలీసులకు అప్పగించారు.

పోలీసులు బ్యాగును తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సుబ్బారావుకు సమాచారం ఇచ్చి, నగలను ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు.. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరరావు నిజాయితీని మెచ్చి సత్కరించారు. ఇదే తరహాలో మరో ఘటనలో ప్రయాణికులు మర్చిపోయిన బంగారాన్ని అప్పగించిన ఆటో డ్రైవర్ ఖలీల్ను కూడా ఎస్పీ అభినందించారు.

## తుషార్ గాంధీ మాట కూడా వినకుండా కూల్చివేతలు

హైదరాబాద్ మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీ విగ్రహం మాకు అవసరంలేదని చెబుతున్నా కూడా వినకుండా రేవంత్ రెడ్డి పేదల ఇల్లు కూల్చుతున్నాడని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు.

వెలుగుమట్ల గాజా అయినట్లు రేపు తెలంగాణ మొత్తం గాజా అవబోతుంది . రాజేంద్రనగర్ మానస హిల్స్ లో ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను పిండి చేస్తూ.. మళ్లీ సిగ్గులేకుండా రాత్రికిరాత్రికి పేరు మీద పెయింట్ వేసి మాకు సంబంధం లేదని మంత్రి పొంగులేటి చెబుతున్నాడు.

ఈయన మళ్లీ వెలుగుమట్ల పేద ప్రజలను పెయిడ్ బ్యాచ్, ల్యాండ్ మాఫియా అంటున్నాడని అన్నారు.

## ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న స్పీకర్



హైదరాబాద్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి గా అభివర్ణించారు. బీఆర్ఎస్ బీఫామ్ మీద ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమే. స్పీకర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూన్నారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించడం తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సరైన సమయంలో సమాధానం చెబుతారని అన్నారు.

## “నిద్రమత్తు వదలండి.. క్షేమంగా ఇంటికి చేరండి”

### అర్ధరాత్రి హైవేలపై వినూత్న ‘ఫేస్ వాష్ అండ్ గో’ కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం ఢ మార్కాపురం జిల్లా పోలీసులు



ఒంగోలు రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు మరియు మార్కాపురం జిల్లా పోలీసులు వినూత్నంగా ‘ఫేస్ వాష్ అండ్ గో’ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు మరియు సిబ్బంది జాతీయ, రాష్ట్ర రహదారులపై తెల్లవారుజామున 1:00 గంటల నుండి 4:30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీర్ఘదూర ప్రయాణం చేసే డ్రైవర్లు అలసట కారణంగా నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, పోలీసులు హైవేలపై వాహనాలను నిలిపి డ్రైవర్లను ముఖం కడుక్కోవాలని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలని మరియు టీ తాగి తాజాగా ప్రయాణం కొనసాగించాలని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని అప్రమత్తంగా వాహనాలు నడపాలని, వేగ పరిమితులను పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## సాగునీటిని విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

సూర్యాపేట జిల్లాలో రైతుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట?జనగామ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డుపైకి వచ్చారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్నప్పటికీ నీరు లేకపోవడంతో చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో సూర్యాపేట? జనగామ ప్రధాన రహదారిపై కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరుపుతున్నారు. సూర్యాపేట జిల్లాలో రైతుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట?జనగామ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డుపైకి వచ్చారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్నప్పటికీ నీరు లేకపోవడంతో చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో సూర్యాపేట? జనగామ ప్రధాన రహదారిపై కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరుపుతున్నారు.

# కలెక్టర్లు కనీసం 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే

## ప్రతీ ఇంటికి సురక్షితమైన మంచినీరు అందించాలి

## కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో సీఎం చంద్రబాబు

అమరావతి కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభోపన్యాసంలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేసారు. సంచా ప్రమాదం, శ్రీకాకుళంలో డయేరియా, రాజమండ్రి పాల కల్తీ ఘటనలను తనను బాధించాయని సీఎం అన్నారు.



ఇలాంటి ఘటనలు జరగ్గకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారుల పైనే ఉంది. కలెక్టర్లు, సెక్రటరీలు ఫీల్డ్ విజిట్స్ చేయాలని సీఎం ఆదేశించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ శ్రీకాకుళం డయేరియా, రాజమహేంద్రవరం కల్తీ పాలు, వేట్లపాలెం బాణా సంచా లాంటి ఘటనలు బాధాకరం. ప్రజల ప్రాణాలు లెక్క చేయకుండా ఎవ్వరు వ్యవహరించినా కఠినంగా ఉంటాం. స్వార్థపరులు చేతుల్లోకి పరిస్థితులు వెళ్లడానికి వీల్లేదు. ఉదాసీనంగా ఉండబోం. నీరు కలుషితం, పాలు కల్తీ అవుతుంటే ఆయా విభాగాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు.

బాణా సంచా నిబంధనలకు విరుద్ధం తయారు చేస్తుంటే ఏం చేస్తున్నారు..? కలెక్టర్లు కనీసం 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. సీనియర్ సెక్రటరీలు 4 రోజుల పాటు క్షేత్రస్థాయికి వెళ్లాలి. దీనిపై పోర్టల్ తయారు చేసి ఆన్ లైన్ లో పెట్టేలా సీఎస్ బాధ్యత తీసుకోవాలి క్షేత్ర స్థాయి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సింది కలెక్టర్లే... ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదు ఏది వాస్తవమో అధ్యయనం చేసుకుని తగిన నిర్ణయం తీసుకునే బాధ్యత కలెక్టర్లదే. సంజీవని ప్రాజెక్టును సమర్ధంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి. 72 లక్షల మందికి వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నట్టు స్క్రీనింగ్ లో తేలింది. ప్రతీ ఇంటికి సురక్షితమైన మంచినీరు అందించాలి. గత పాలకులు చేసిన తప్పు వల్ల జేజేఎం కింద నిధులు కోల్పోయాం. శాశ్వత పరిష్కారంగా ప్రాజెక్టులు పూర్తి చేసి ఉండాల్సింది. కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే జేజేఎం గత ప్రభుత్వం కింద ఖర్చు పెట్టింది. ఈ ప్రాజెక్టును కొనసాగించాలని కేంద్రాన్ని కోరాం. పాత స్కీంను 28 వేల కోట్లను ఖర్చు చేసేలా 2028 వరకూ పొడిగించారు... ఇది చాలా సంతోషించదగ్గ విషయం. ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు ఇచ్చేలా కనెక్టు చేయండి, స్థానిక నీటి వనరుల నుంచి నీటిని అందించేలా చూడండని అన్నారు.

2 ఏళ్లలో జేజేఎం పథకాన్ని పూర్తి చేసుకుని ప్రతీ ఇంటికీ కుళాయి ఇవ్వండి. పైప్ లైను వేయడం కోసం రోడ్లను తవ్వేసి మళ్లీ సరి చేయకుండా వదిలేస్తున్నారు. ఈ విషయంలో ఖచ్చితంగా ఉండాల్సిందే. మేజిక్ డ్రెయిన్లను కూడా వేగంగా చేయండి. ఫైబర్ గ్రిడ్ ద్వారా ఇంటర్నెట్ ను ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం. ఇల్లు, ఇంటి జాగా కూడా మూడేళ్లలో ఇవ్వాల్సి ఉంది. ఉగాదికి 2.50 లక్షల మందికి , జూన్ నెలలో మరికొన్ని ఇళ్లను లబ్దిదారులకు ఇస్తాం. వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు కూడా అమల్లోకి వస్తున్నాయి. ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ మార్చి 15 కు ప్రారంభం అవుతుంది. కనీసం 50 మున్సిపాలిటీలకు అవార్డులు రావాలని అన్నారు..

# కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలి కేఎల్ఆర్

## కేంద్ర కొత్త చట్టాలతో కర్షకలోకానికి నష్టం

## శ్రామికులకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం

రంగారెడ్డి పారిశ్రామిక అభివృద్ధితోపాటు... కర్షకుల బాగోగులు చూసినప్పుడే రాష్ట్రం, దేశాభివృద్ధి జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నాడు కందుకూరుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె కుమార్ కు మండల ఐఎన్టీయూసీ కార్మిక శాఖ విభాగం అధ్యక్షుల నియామక పత్రాన్ని ఆయన అందజేశారు.మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ అధ్యక్షులు నడికుడి శివ ఆధ్వర్యంలో తుక్కుగూడ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేఎల్ఆర్ మాట్లాడారు.కేంద్రం రూపొందించిన కొత్త చట్టాలతో కార్మికుల భద్రత, ప్రాణ, ఆరోగ్యానికి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల చట్టాలు, రక్షణపై అవగాహన పెంచుకోవాలని నూతనంగా ఎన్నికైన ఐఎన్టీయూసీ నాయకులకు లక్ష్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

# 2026-27 ఆర్థిక సంవత్సరానికి విద్యా శాఖకు రూ.118.89 కోట్లు

## డిజిటల్ క్లాస్ రూములు, మౌళిక సదుపాయాలు

## విద్యా రంగ అభివృద్ధికి అగ్రపీఠం వేసిన టిటిడి

తిరుపతి, 2026 మార్చి 11 టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థల సమగ్ర అభివృద్ధికి 2026?27 ఆర్థిక సంవత్సరానికి రూ.118.89 కోట్ల నిధులను టిటిడి కేటాయించింది. అత్యాధునిక సాంకేతికత, విద్యార్థుల సామర్థ్యాల పెంపు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యా శాఖలో సమగ్ర మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.గతంలో టిటిడి విద్యా శాఖలో జీతాలు మినహా అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులు ఇలా ఉన్నాయి. 2021?22 సంవత్సరానికి రూ.24.37 కోట్లు, 2022?23 సంవత్సరానికి రూ.39.04 కోట్లు, 2023?24 సంవత్సరానికి రూ.33.08 కోట్లు, 2024?25 సంవత్సరానికి రూ.25.99 కోట్లు, 2025?26 సంవత్సరానికి రూ.13.08 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో భవనాల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి తదితర పనులు చేపట్టారు.ఈ ఏడాది 2026?27 ఆర్థిక సంవత్సరానికి శ్రీ ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ మరియు టిటిడి కలిపి విద్యాసంస్థలను మరింత ఆధునికరించి విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మొత్తం రూ.118.89 కోట్లు కేటాయించారు. టిటిడి విద్యా సంస్థల్లో విద్యార్థిని విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన సమీక్షలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో టిటిడి విద్యా సంస్థల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఈసారి రూ.118.89 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో టిటిడి విద్యా సంస్థలలో అదనపు తరగతి గదులు, అదనపు వసతి గదుల నిర్మాణం, పాఠశాలలు మరియు కళాశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.అలాగే విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి స్పోర్ట్స్, సాంస్కృతిక మరియు సహ పాఠ్య కార్యకలాపాలు, టీచింగ్ మరియు నాన్-టీచింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే విద్యార్థుల కోసం ఐఐటీ, నీట్, సీఏ, క్లాట్ తరహా కోర్సులు, స్కిల్ డెవలప్మెంట్, జాబ్ ఓరియెంటెడ్ మరియు వృత్తి ఆధారిత కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు.అత్యాధునిక సాంకేతిక బోధనకు పెద్దపీట వేస్తూ డిజిటల్ క్లాస్రూమ్స్, కంప్యూటర్లు, స్మార్ట్ ప్యానల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్లు, వర్చువల్ కాన్ఫరెన్స్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలలలో ఆధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, మొబైల్ మెడికల్ యూనిట్ సేవలు అందించడం వంటి చర్యలు చేపట్టనున్నారు.ప్రత్యేకంగా శ్రీ పద్మావతి మహిళా విద్యాసంస్థల (ఎస్పీడబ్ల్యూ జూనియర్, ఎస్పీడబ్ల్యూ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు)లో చదువుతున్న విద్యార్థినులకు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

# మచిలీపట్నంలో సివిల్ సప్లై అధికారుల మెరుపు దాడి

## 160 క్వింటాళ్ల చౌక బియ్యం స్వాధీనం

మచిలీపట్నంలోని చింతచెట్టు సెంటర్ వద్ద బుధవారం తెల్లవారుజామున సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. ఉదయం నాలుగు గంటల సమయంలో చౌక బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో అధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు.

తనిఖీల్లో అనుమతి లేకుండా తరలిస్తున్న సుమారు 160 క్వింటాళ్ల చౌక బియ్యం ను అధికారులు గుర్తించారు. వెంటనే ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసుల సహాయంతో ఇరుగుదురు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న వారిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

# స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ




హైదరాబాద్ పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి లకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్ అని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్పై ఎంపి గా పోటీ చేసి వ్యక్తి కి క్లిన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజలు ఇచ్చిన తీర్పును నిర్లక్ష్యం చేసినట్టే. పార్టీ మార్పులను నియంత్రించాల్సిన స్పీకర్ వ్యవస్థ, అదే ఫిరాయింపులకు రక్షణగా నిలవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం మార్చుకోవడం సరైంది కాదని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఈ తరహా నిర్ణయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. సరైన సమయంలో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని అన్నారు.

# హైదరాబాద్లో దోశ, పూరి, వడ బంద్



హైదరాబాద్ ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ప్రభావం హైదరాబాద్ హోటళ్లపై పడింది. తాత్కాలికంగా మూసివేత దిశగా హోటళ్లు, హాస్టళ్లు, మెస్లు వున్నాయి. మరికొన్ని హోటళ్లు మెనూను కుదించి, ధరలు పెంచాయి. వండేందుకు ఎక్కువ నూనె తీసుకునే, ఎక్కువ సమయం తీసుకునే టీ, కాఫీ, చపాతీ, దోశ, పూరిలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు హైదరాబాద్ ఐటీ కారిడార్ హోటళ్ల అసోసియేషన్ ప్రకటించింది. ఎక్కువ సేపు వండే వంటలను తగ్గించి అన్నం, సాంబార్, పప్పు, రసంలనే హైదరాబాద్లోని పీజీ హాస్టళ్లు, మెస్లు వడ్డిస్తున్నాయి. రవాణా ఛార్జీలు పెరగడంతో దోశ, పూరి, వడలపై కనీసం రూ.15.. ఇడ్లీ, ఉప్మా లాంటి వాటిపై కనీసం రూ.10 వరకు పెంచారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ఢిల్లీలో శిక్షణ పొందుతున్న వేములవాడ అర్బన్ సర్పంచ్




ప్రజాబలం ప్రతినిధి ( వేములవాడ మార్చి -11) దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్పంచుల శిక్షణా సమావేశానికి బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చిర్లవంచ గ్రామానికి చెందిన కొలుగురి కిరణ్మయి- మధు హాజరయ్యారు. గ్రామ పంచాయతీల బలోపేతం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా సశక్త్ పంచాయతీ అభియాన్లో భాగంగా ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉన్నత స్థాయి సమావేశంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటలైజేషన్ అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఒకసారి సర్పంచ్ అయితే ఎప్పటికీ సర్పంచ్ లాగే బాధ్యతగా ఉండాలి అనే నినాదంతో ప్రజాప్రతినిధుల్లో స్ఫూర్తిని నింపుతున్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనడంపై సర్పంచ్ కిరణ్మయి- మధు హర్షం వ్యక్తం చేస్తూ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులతో కలిసి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను చిర్లవంచ గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటానని ఆమె వెల్లడించారు.

# అన్నమయ్య సంకీర్తనలను రాగిరేకుల నుండి పరిష్కరించి బాణీలు కట్టిన ఘనత రాళ్లపల్లి వారిదే

## ఆచార్య కొడిదల శోభ

తిరుపతి, 2026 మార్చి 11 అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ 47వ వర్ధంతిశ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించడంలో శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ విశేష కృషి చేశారని ఎస్పిడబ్ల్యూ మహిళా డిగ్రీ మరియు పిజి కళాశాల తెలుగు అధ్యాపకులు డా.శోభ తెలిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో బుధవారం ఉదయం శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 47వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా డా. శోభ "రాళ్లపల్లి వారు దర్శించిన సారస్వతా లోకము" అనే అంశంపై మాట్లాడుతూ, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు తెలుగు సాహిత్యంలోని విశాలమైన సారస్వత ప్రపంచాన్ని లోతుగా అధ్యయనం చేసి తమ రచనల ద్వారా పాఠకులకు పరిచయం చేసిన మహానుభావులని తెలిపారు. ఆయనకు ఉన్న విస్తృతమైన పాండిత్యం, సాహిత్యంపై ఉన్న అపారమైన అభిరుచి, పరిశీలనాత్మక దృష్టి కారణంగా సాహిత్యంలోని వివిధ ప్రక్రియలను సమగ్రంగా అర్థం చేసుకుని వాటి సౌందర్యాన్ని స్పష్టంగా వివరిస్తూ సాహిత్యాభిమానులకు మార్గదర్శకత్వం చూపారని ఆమె పేర్కొన్నారు. రాళ్లపల్లి వారు తమ రచనల ద్వారా తెలుగు సారస్వతాన్ని సమృద్ధిగా చేసి సాహిత్య లోకానికి చిరస్థాయిగా నిలిచే సేవలు అందించారని ఆమె కొనియాడారు.తరువాత నగరికి చెందిన తెలుగు పండితులు డా. మలేపట్టు పురుషోత్తమాచారి "రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి జీవితం ? రచనలు" అనే అంశంపై మాట్లాడుతూ, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు తెలుగు సాహిత్యం మరియు సంగీత రంగాలలో విశిష్టమైన సేవలు చేసిన మహనీయులని తెలిపారు. ఆయన జీవితమంతా సాహిత్యాభివృద్ధికి అంకితమై ఉండి అనేక విలువైన రచనలు చేసి తెలుగు భాషకు కీర్తి తీసుకొచ్చారని చెప్పారు. అలాగే ఆయన పండితత్వం, సంగీతంపై ఉన్న లోతైన జ్ఞానం మరియు సాహిత్యంపై ఉన్న అభిరుచి కలిసి ఆయనను గొప్ప రచయితగా, పండితునిగా నిలబెట్టాయని కొనియాడారు.అనంతరం ఎస్వి విశ్వవిద్యాలయం విశ్రాంత అచార్యులు ఆచార్య దామోదర్ నాయుడు "విమర్శకుడిగా రాళ్లపల్లి" అనే అంశంపై ప్రసంగిస్తూ, రాళ్లపల్లి వారు తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం పొందిన మహనీయులని కొనియాడారు. రాళ్లపల్లి గారు కేవలం సంగీత విద్వాంసుడిగానే కాకుండా, సాహిత్యాన్ని లోతుగా అర్థం చేసుకుని విశ్లేషించే నిశితమైన విమర్శనా దృష్టి కలిగిన గొప్ప సాహిత్య విమర్శకుడిగా గుర్తింపు పొందారని చెప్పారు. వారి విమర్శలు లోతైన అధ్యయనం, నిష్పాక్షికత మరియు విశ్లేషణాత్మకతతో కూడి ఉండి తెలుగు సాహిత్య విమర్శకు విశేష సేవ చేశాయని వివరించారు.

# కాకినాడ జిల్లాలో హడలెత్తిస్తున్న పెద్దపులి

కాకినాడ గత పదిరోజులుగా పోలవరం ,కాకినాడ జిల్లాలలో తన సంచారం తో పెద్ద పులి హడలెత్తిస్తుంది. ఏలేరు నదీ పరివాహక ప్రాంతం, ఏలేరు వెనుక జలాలు మరియు అటవీ ప్రాంతాలలో పెద్ద పులి తిరుగుతోంది. బుధవారం ప్రత్తిపాడు మండలం ధారపల్లి వద్ద వాటర్ ఫాల్స్ సమీపంలో సంచరిస్తున్నట్లుగా అధికారులు ధ్రువీకరించారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది, పోలీస్ మరియు అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిసర గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసారు. స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం , కిత్తమూరి పేట, కె .మిర్తివాడ , ఉలిగోగుల, మెట్టు చింత, ధారపల్లి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసారు.

# పట్టణంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తికి ఇళ్ల స్థలాలు చూపించాలి సిపిఎం



ఆత్మకూర్ పట్టణంలో దరఖాస్తు చేసిన ప్రతి వ్యక్తికి ఇళ్ల స్థలాలు చూపించాలని, పక్కా గృహాలు నిర్మించుకునేందుకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అర్హులైన వారికి పెన్షన్స్ ఇవ్వాలని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఏ. రాజశేఖర్,పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ కోరారు. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ బృందం ఆధ్వర్యంలోస్థానిక ఎం ఎల్ ఏ బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారికి అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎం ఎల్ ఏ బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యక్తికి అర్జీదారునికి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని, ఇల్లు నిర్మించుకునేందుకు 5 లక్షల రూపాయలు ఇవ్వడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సమస్య ను పరిస్కారికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఏ. రాజశేఖర్, ఏ. రణధీర్ లు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇసుక, ఇనుము, సిమెంట్, ధరలు పెరగడం వలనఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని పేద మధ్యతరగతి కుటుంబాలు చిన్నచిన్న గదిలో నివాసం ఉంటూ ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం క్యాబినెట్లో ఇంటి స్థలాల పంపిణీ చేయడానికి అంగీకారం తెలిపింది అన్నారు. తక్షణమే ఇంటి స్థలాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి సర్వే చేయాలని అర్హుల జాబితాను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో 2001 2003లో దుద్యాల రోడ్డు, చక్రం హోటల్ వెనుక, మైనార్టీ కాలనీలో పట్టాలు వచ్చి నేటికీ స్థలాలు రానివారు అనేక మంది ఉన్నారని వారికి కూడా ఇళ్లస్థలాలు ఇవ్వాలని, జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు వచ్చి హైవేలో స్థలాలు కోల్పోయిన వారికి నేటికి స్థలాలు చూపించలేదని వారికి స్థలాలు చూపించాలని, ప్రభుత్వ స్థలాల్లో అనేక సంవత్సరాల నుంచి కాపురం ఉంటున్న పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు డి. రామ్ నాయక్,ఏ సురేంద్ర,వీరన్న, షైక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

# అన్న కాంటీన్లలో మరింత నాణ్యమైన ఆహార పదార్థాలు అందిద్దాం.

## దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వండి .కమిషనర్ ఎన్.మౌర్య.



అన్న కాంటీన్ల ద్వారా ప్రజలకు మరింత నాణ్యతతో, పరిశుభ్రతతో ఆహార పదార్థాలు అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కమిటి సభ్యులకు, అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్న కాంటీన్ల నిర్వహణ, కమిటీ బాధ్యతలపై సలహా మండలి సభ్యులు, అధికారులతో, అక్షయ పాత్ర ప్రతినిధులు, క్యాంటీన్ నిర్వాహకులతో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఐదు రూపాయలకే నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు అందించేలా ప్రభుత్వం అన్న కాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కాంటీన్ల ద్వారా ఇప్పటికే నాణ్యమైన, పరిశుభ్రతతో కూడిన ఆహార పదార్థలను అందిస్తున్నామని తెలిపారు. అయితే మరింత నాణ్యతతో, కాంటీన్లను మెరుగ్గా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్న కాంటీన్లను శుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రమైన త్రాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే నిర్ణీత సమయంలో ఆహార పదార్థాలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా కమిటీ సభ్యులు, అధికారులు అన్న కాంటీన్లను పరిశీలించాలని తెలిపారు. ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకుని ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్వాహకులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సాయం అందించేలా దాతలతో సంప్రదించాలని తెలిపారు. వీల్ చైర్లో వచ్చే వారి కొరకు ర్యాంపు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్న కాంటీన్ల సి.ఈ.ఓ వంశిధర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 205 కాంటీన్లు నిర్వాహస్తున్నామని, నూతనంగా 70 కాంటీన్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మన వూరు - మన కాంటీన్ అనే నినాదంతో అన్న కాంటీన్లను మరింత మెరుగ్గా నిర్వహించేలా, అభివృద్ధి చేసేలా కమిటి సభ్యులు సలహాలు ఇవ్వాలని కోరారు. పుట్టినరోజులు, పెళ్లి రోజులు వంటి ప్రత్యేక రోజుల్లో డొనేషన్ చేస్తే దాత పేరు, తదితర వివరాలను స్క్రీన్ పై ప్రదర్శిస్తామని తెలిపారు. రెండు వేలు రూపాయలు పైన విరాళం ఇస్తే పాన్ నెంబర్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. వీరికి 12జి, 80జి వంటి వారి ద్వారా ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. వృద్దులు, వికలాంగులు కూర్చుని భోజనం తినేలా కుర్చీలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. సలహా మండలి సభ్యులు ఆర్.సి. మునికృష్ణ(తిరుపతి ), ఎస్.కె.బాబు(తిరుపతి), సి.కె.రేవతి (తిరుపతి), రాధ (పుత్తూరు), ప్రభావతి (వేంకటగిరి), డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవిన్యూ అధికారి సేతు మాధవ్, అక్షయ పాత్ర, హారే కృష్ణ మూవీ?మెంట్ ప్రతినిధులు శివ గణేష్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 22 న ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని ప్రారంభించనున్నసీఎం రేవంత్ రెడ్డి




హుస్నాబాద్ ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని ఈనెల 22 న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారుహుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో వ్యవసాయ యాంత్రికీకరణ పథకంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాలకు చెందిన 38 మంది రైతులకు 53 లక్షల 80 వేల రూపాయల విలువైన 36 రోటోవేటర్లు,2 స్ట్రాబెలర్స్ గడ్డిని కట్టకట్టే యంత్రాలు, వ్యవసాయ పరికరాలను 50% సబ్సిడీతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. రైతులకు శ్రమను తగ్గించి అధిక దిగుబడులను సాధించేందుకు అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా వ్యవసాయ పనిముట్లను తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈనెల 22 న నంగునూరు మండలం నర్మెట్టలో నూతనగా నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని..ఈ సందర్భంగా మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహించి వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించడం జరుగుతుందని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి సీఎం పర్యటన కోసం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పరిశీలిస్తామని తెలిపారు. వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో అధికంగా ఉపయోగపడే చిన్నచిన్న పరికరాలను గతంలో రైతులకు అందించలేదని ఇప్పుడు అందిస్తున్నామని అన్నారు. అదేవిధంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎస్సీ,ఎస్టీ కాంపోనెంట్ కింద ఇంకా వ్యవసాయ పరికరాలను అందించేందుకు వీలుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు రైతులను యాత్రికరణలో భాగంగా వ్యవసాయ పరికరాలను తీసుకునేందుకు ప్రోత్సహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, ఆత్మ కమిటీ చైర్మన్ ఐలయ్య, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్, వ్యవసాయ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రిమాండ్ ఖైదీ బద్వేల్ జడ్పిటిసి చిన్న పోలిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ గోవింద రెడ్డి వైకాపా నాయకులు



బద్వేలు బద్వేల్ సబ్ జైలులో రిమాండ్ లో ఉన్న జడ్పిటిసి వంకల చిన్న పోల్ రెడ్డి ని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని ఆక్షేపించారు. ఒక కేసు తర్వాత మరో కేసు నమోదు చేస్తూ పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి వేధింపులు కొనసాగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఎన్నికల ముందు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ “రెడ్ బుక్”లో వైఎస్ఆర్సీపీ నాయకుల పేర్లు నమోదు చేసుకున్నామని చెప్పినట్టుగా ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేస్తూ ముఖ్యమంత్రి , మంత్రి లోకేష్ రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.×బద్వేల్ నియోజకవర్గంలో కూడా స్థానిక కూటమి నాయకుల ప్రోత్సాహంతో వైఎస్ఆర్సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయంగా బలహీనపరచాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. జడ్పిటిసి పోల్ రెడ్డి పై నమోదైన కేసు కూడా ఇదే కుట్రలో భాగమని ఆయన అన్నారు. 2011లో జరిగిన సొసైటీ వ్యవహారంపై అప్పట్లోనే విచారణలు పూర్తై డబ్బులు కూడా తిరిగి చెల్లించి నప్పిటికి దాదాపు 14 సంవత్సరాల తర్వాత అదే అంశాన్ని మళ్లీ తీసుకుని కేసు నమోదు చేయడం పూర్తిగా అన్యాయమని చెప్పారు.

2009-2014,2014?2019, 2019?2024 వరకు మూడు ప్రభుత్వాలు మారినా ఇప్పుడు మళ్లి ఈ కేసును తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ దురుద్దేశ్యాలే ఉన్నాయని విమర్శించారు.ఒక ప్రజాప్రతినిధి అయిన చిన్న పోల్ రెడ్డి కి కనీసం నోటీసు ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేసి జైలుకుతీ పంపడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని వైఎస్ఆర్సీపీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కూటమి నాయకులు వారి కుటుంబాలకు సంబంధించిన అనేక అక్రమాల గురించి పత్రికలు, ప్రచార మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి అన్యాయాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి వంకల చిన్న పోల్ రెడ్డి త్వరలోనే బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, వైఎస్ఆర్సీపీ నాయకులు అందరూ ఐక్యంగా నిలబడి పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు.×ఈ కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మల్లేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర జిల్లా అనుబంధ విభాగాల నాయకులు పార్టీ సీనియర్ నాయకులు వంకల పెద్ద పోలిరెడ్డి, యద్దారెడ్డి, పుత్తా శ్రీరాములు, బిజివేముల రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఆర్ఎఫ్ టైర్స్ రమణారెడ్డి, రమేష్ బాబు, వెంకటసుబ్బారెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, వీరారెడ్డి, జయరాం రెడ్డి, ఓబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# మహిళను చావు నుండి కాపాడిన పోలీసులు ప్రజల మన్నలను పొందుతున్న సీఐ ప్రభాకర్



నరసరావుపేట, ఉ :పల్నాడు జిల్లా నరసరావుపేట శ్రీనివాస్ నగర్ కు చెందిన అన్నం రమణ (55), భర్త కొండయ్య ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్లో చికిత్స తీసుకున్నప్పటికీ తగ్గకపోవడంతో కలత చెంది రైలుకింద పడేందుకు వెళ్లిన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన నరసరావుపేట టూ టౌన్ సీఐ చి. ప్రభాకర్ తన సిబ్బందిని పంపించి ఆమెను సురక్షితంగా తీసుకుని వచ్చి ఇంటికి చేర్పించారు.టూ టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నరసరావుపేట పట్టణ ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని స్థానికులు అభినందిస్తున్నారు. ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించే సీఐని ఇప్పుడే చూస్తున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

# డంపింగ్ యార్డును పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ డంపింగ్ యార్డ్ వల్ల కరీంనగర్ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయిన మంత్రి పొన్నం ప్రభాకర్.కరీంనగర్ పట్టణ ప్రజల ఇబ్బందులు పడుతున్న దృశ్య చొప్పదండి సభలో కరీంనగర్ డంపింగ్ యార్డు తరలిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.కరీంనగర్ డంపింగ్ యార్డు శాశ్వతంగా తరలించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డంపింగ్ యార్డు ద్వారా ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు స్వయంగా అక్కడకి వెళ్లి పర్యటించి తెలియజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కమిషనర్ ప్రఫుల్ దేశాయి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్పొరేటర్ అంజన్ కుమార్, పలువురు కార్పొరేటర్లు,ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.పెద్ద నగరాల్లో చెత్త సేకరణ వ్యర్థాల తరలింపు సమస్యగా మారింది.గతంలో కేంద్ర మంత్రి కట్టర్ కరీంనగర్ కి వచ్చినప్పుడు కరీంనగర్ ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉన్నటువంటి అనారోగ్యాలకు కారణం అవుతున్న డంపింగ్ యార్డ్ తరలించాలని విజ్ఞప్తి చేశాం.ఇటీవల ముఖ్యమంత్రి చొప్పదండి వచ్చినప్పుడు కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్య స్థానిక జిల్లా నేతలము ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సభా వేదిక మీద నుండి కరీంనగర్ ప్రజలను ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న డంపింగ్ యార్డ్ తరలిస్తామని హామీ ఇచ్చారు.కరీంనగర్ నుండి తరలించిన డంపింగ్ యార్డ్ వరంగల్ కరీంనగర్ మధ్యలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.డంపింగ్ యార్డ్ మేనేజ్మెంట్ విషయంలో ఇబ్బందులు లేకుండా రెండు నగరాల మధ్య ఎవరికి ఇబ్బందులు లేకుండా ఈ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తాం. శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం కమిషనర్ కార్పొరేటర్లు కలిసి డంపింగ్ యార్డ్ ను పరిశీలించడం జరిగింది.కరీంనగర్ స్మార్ట్ సిటీ లో వెస్ట్ మేనేజ్మెంట్ కి సంబంధించి సరైన చర్యలు తీసుకోలేక పోయారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పక్షాన డంపింగ్ యార్డ్ ను పరిశీలించడం జరిగింది.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు డంపింగ్ యార్డ్ తరలింపులో డైలీ వచ్చే వెస్ట్ మేనేజ్మెంట్. ఇప్పటికే స్టోర్ అయిన వేస్ట్ మేనేజ్మెంట్ ఎలా తరలించాలని దానిపై ఒక విధానాన్ని తీసుకుంటాం.ఒక స్వచ్ఛంద సంస్థ చెత్త తరలించడానికి ముందుకు వస్తున్నారుముఖ్యమంత్రి ఇచ్చిన హామీని ప్రజాప్రతినిధులను అధికారుల బాధ్యత తీసుకున్నాం.డంపింగ్ యార్డ్ వల్ల కరీంనగర్ ప్రజల శ్వాసకోస ఇబ్బందులతో పాటు, అనేక వ్యాధులు సంభవిస్తున్నాయి40 సంవత్సరాలుగా పేరుకుపోయిన డంపింగ్ యార్డ్ ను ఇప్పటికిప్పుడు తరలించేందుకు ఒక రోజులో అయ్యేది కాదు, సంవత్సరంలోపు పూర్తి స్థాయిలో తరలిస్తాం.రాజకీయాలకతీతంగా అధికారంలో ఉన్న పార్టీ ప్రజా ప్రతినిధులుగా ముఖ్యమంత్రి హామీ మేరకు డంపింగ్ యార్డ్ తరలింపుకు చొరవ తీసుకుంటాండంపింగ్ యార్డ్ తరలించే ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తుంది.

## వాటర్ ట్యాంక్ ఎక్కి వాటర్ ట్యాంక్ శుభ్రతను పరిశీలించి వర్కర్లను అభినందించి సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.





**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి**కామారెడ్డి జిల్లా బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా బుధవారం జిల్లా లోని సదాశివ నగర్ మండలంలో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన వాటర్ ట్యాంక్ ఎక్కి తనిఖీ చేసి పరిశుభ్రత పనులు నిర్వహిస్తున్న కార్మికులతో మాట్లాడారు.

సదాశివ నగర్ 1వ వార్డు,

ానూ= ట్యాంక్ సామర్థ్యం: 90 ఖూ

పనిచేసిన కార్మికులు

ఎల్లగారి భుచ్చయ్య

పోట్నగారి ప్రవీణ్ లు

పరిశుభ్రత పనులను సమర్థవంతంగా నిర్వహించిన వారిని జిల్లా కలెక్టర్ అభినందించి వారిని సన్మానించారు. గ్రామాలలో పరిశుభ్రత, తాగునీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకుల శుభ్రతను తరచూ నిర్వహించాలని, పంచాయతీ సిబ్బంది , కార్మికులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జజూూ చందర్, ప్రత్యేక అధికారి సతీష్, ఎశ్రీజూశీ శ్రీనివాస్, పంచాయతీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు , సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యం లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిది** కామారెడ్డి జిల్లా బుధవారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే International Womenμs Day సందర్భంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ Ashish Sangwan హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక , రాజకీయ రంగాలలో మహిళలు సాధించిన విజయాలను గుర్తించి అభినందించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళల సాధికారత సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళలకు విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు, భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు.




అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న Beti Bachao Beti Padhao, Pradhan Mantri Ujjwala Yojana, Sukanya Samriddhi Yojana వంటి పథకాలు మహిళల సాధికారతకు దోహదపడుతున్నాయని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వచ్చి నాయకత్వ పాత్రలు పోషించాలని ఆయన ఆకాంక్షించారు.

కార్యక్రమంలో విద్య, ఆరోగ్యం, వ్యవస్థాపకత , సామాజిక సేవ వంటి విభిన్న రంగాలలో ప్రతిభ కనబర్చిన మహిళలను ఘనంగా సత్కరించారు. మహిళల హక్కులు, భద్రత , అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ప్రమీల, బిచ్కుంద మున్సిపల్ చైర్‌పర్సన్ సీమా సెట్‌కార్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, డిపిఆర్‌ఓ తిరుమల, డీఎం రమ్య, ఐసిడిఎస్ సిడిపిఒలు, సూపర్వైజర్లు, అడిషనల్ డీఆర్‌డిఓ విజయలక్ష్మి, సిడబ్ల్యుసి సభ్యురాలు స్వర్ణలత, జిల్లా మహిళా సాధికారత సిబ్బంది శారద, తులసి, సౌందర్య, అరుణ్ కుమార్, బాల రక్షాభవన్ అధికారి స్రవంతి, చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్, సఖి సిబ్బంది కవిత తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి జనగణనే దిక్సూచి ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాటే




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**దేశాభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు పకడ్బందీగా జరిగే జనగణనే దిక్సూచిగా ఉంటుందని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) యువరాజ్ మర్మాటే అన్నారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన "భారత జనగణన--2027" కు సంబంధించిన జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్. రాజేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పి ఓ మాట్లాడుతూ, జనగణన నుండి జనకల్యాణం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారం భవిష్యత్తు సంక్షేమ పథకాలకు ఆధారమవుతుందని, అందువల్ల ఎక్కడా పొరపాట్లు లేకుండా గణన చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మారుమూల గిరిజన తండాల్లో ఏ ఒక్క ఇల్లు కూడా మిగలకుండా గణన నిర్వహించాలన్నారు.

అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జనగణన ఇదని తెలిపారు. దేశంలో ఇది 16వ జనగణనగా నిర్వహించబడుతుందని చెప్పారు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని వెల్లడించారు. మొదటి దశలో భాగంగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియ మే 11, 2026 నుంచి జూన్ 9, 2026 వరకు జరుగుతుందని తెలిపారు. ఇందులో ఇంటి నిర్మాణం, వసతులు, కుటుంబ యజమాని వివరాలు తదితరంగా 33 అంశాలపై సమాచారం సేకరిస్తారని చెప్పారు. రెండో దశగా జనాభా గణన ఫిబ్రవరి 2027లో నిర్వహించి, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని వివరించారు.

దేశంలో తొలిసారిగా ఈసారి జనగణనను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్ ద్వారా గణన చేపట్టడంతో పాటు, ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గణన ప్రారంభానికి 15 రోజుల ముందే ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి రానుంది.

ఈ శిక్షణా కార్యక్రమంలో హైదరాబాద్ జనాభా గణన విభాగం గణాంక అధికారులు ఆదెపు వినయ్, వై. జంగయ్యలు అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలు, వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మార్చి 13 వరకు ఈ శిక్షణ కొనసాగనుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవీందర్ రాథోడ్, డీపీఓ రమేష్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని బాధ్యతగా కొనసాగించాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** నిర్మల్ జిల్లా లోనీ లక్ష్మణచందా మండలం పొట్టపల్లి (కె) గ్రామంలోఈరోజు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్థానికులతో కలిసి చీపురుతో పరిసరాలు శుభ్రం చేశారు. కొడవలితో పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రతిరోజు బాధ్యతగా ప్రజలంతా తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అనంతరం గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలలో గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. అర్హత ఉన్న మహిళలందరూ మహిళా సంఘాల్లో చేరి, తద్వారా లభించే రుణాల వల్ల ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా, గ్రామస్తులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులకు వివిధ వస్తువుల తయారీలో శిక్షణను ఇప్పించి, మార్కెటింగ్ చేసుకునే విధంగా ప్రోత్సహిస్తామని అన్నారు. గ్రామస్తులు ఎవరూ కూడా తమ పిల్లలకు నిర్ణీత వయసు దాటనిదే వివాహాలు చేయరాదని సూచించారు.

ఆ తర్వాత, నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ప్రతిరోజు సమయం ప్రకారం మొక్కలకు నీటిని అందిస్తూ, మొక్కలను సరిగ్గా పెంచాలని పేర్కొన్నారు. మొక్కల పెంపకం కు సంబంధించి రిజిస్టర్ పరిశీలించారు.

సమీపంలోనే గల మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, రోజు పాఠశాలకు రావాలని చెప్పారు. బోర్డుపై రాసిన అక్షరాలను వారితో చదివించారు. పిల్లలకు ప్రతిరోజు మెనూ ప్రకారం మంచి ఆహారాన్ని అందించాలన్నారు. చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

పాఠశాల మరమ్మత్తుల విషయమై ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, జెడ్పి సిఈఓ శంకర్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, గ్రామ సర్పంచ్ ముఖేష్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఇతర అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధుల శిక్షణ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్:



"ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై రేపు, ప్రజా ప్రతినిధులకు ఏర్పాటు చేయనున్న అవగాహన కార్యక్రమానికి సంబంధించి తగిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

ప్రత్యేక ప్రణాళిక పై పట్టణంలోని తిరుమల గార్డెన్స్ లో రేపు సర్పంచ్ లకు, మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలవారీగా కౌన్సిలర్లకు, మండలాల వారీగా సర్పంచ్ లకు సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమాన్ని నిర్ణీత సమయానికి ప్రారంభించి, సాఫీగా కొనసాగించాలన్నారు. సరైన లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడి తెరలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు త్రాగునీరు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వాహనాలకు తగిన పార్కింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

భోజనశాలను పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే వారికి, మంచి ఆహారం ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలనలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత -- అడిషనల్ కలెక్టర్




**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మార్చి 11:** భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని, నీటి ఎద్దడి నివారణకు భూగర్భ జలవనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.

కేంద్రీయ భూగర్భ జల బోర్డు, జలశక్తి మంత్రిత్వ శాఖ, జలవనరులు, నదీ జలాల అభివృద్ధి గంగా పునరుజ్జీవ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ మల్కాజ్గిరి ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని సంబంధిత శాఖల ఇంజనీర్లు, క్షేత్ర, సాంకేతిక సహాయకులకు భూగర్భ జలాలను సంరక్షించుకోవడంపై నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భూగర్భ జలాల సంరక్షణకు సంబంధించి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తారని వాటి ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలు కావడానికి, కాపాడుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించి, నిర్వహించడానికి ప్రధానంగా ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చాక పెద్ద ఎత్తున ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించి నదీ జలాలను ఒడిసి పట్టుకున్నట్టే, అంతరించిపోతున్న భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, తదితర నిర్మాణాలు ఉపయోగపడతాయన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఇలాంటి శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలు సద్వినియోగం చేసుకుని జిల్లాలో భూగర్భ జలాలను పెంచేందుకు ఉన్నతాధికారులు సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సిజిడబ్ల్యుబి శాస్త్రవేత్త డాక్టర్ పండిట్ మధునూర్ మాట్లాడుతూ సాంకేతిక పరంగా భూగర్భ జలాలను కాపాడుకోవడం, వీటికి ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేయడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. భూగర్భ జలాలను కాపాడుకునే విషయంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని ఫలితంగా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. డాక్టర్ సుధీర్ బాబు, సీనియర్ సైంటిస్ట్ మాట్లాడుతూ భూగర్భ జలాల ప్రాముఖ్యత మరియు వాటి పరిరక్షణ అనే అంశం మీద అందరికీ అర్థమయ్యే విధంగా, అర్థవంతంగా, ఉదాహరణలతో వివరించారు మరియు సభ వేదికను నిర్వహించారు. మేడ్చల్ జిల్లా యొక్క భూగర్భ జల స్థితిగతులను జిల్లా భూగర్భ జల అధికారి, ఎం. హరీష్ బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్రీయ భూగర్భ జల మండలి మరియు భూగర్భ జల శాఖ మేడ్చల్ జిల్లా వారి ఆధ్వర్యంలో ముద్రించిన అక్విఫర్ మేనేజ్మెంట్ మరియు భూగర్భ జల గణన నివేదికలను అతిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిజిడబ్ల్యుబి శాస్త్రవేత్తలు మాధవ్, యాదయ్య, రాంబాబు, అమన్ జైన్ మరియు భూగర్భ జల శాఖ నుండి సత్యనారాయణ, వంశీకృష్ణ, కార్తీక ప్రియ, కమల కుమారి, కార్తీక్, రాకేష్, పవన్ కుమార్ మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు మరియు ఇతర శాఖల జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బి ఆర్ ఎస్,పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 11(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన పుల్లయ్యవాండ్ల మల్లేశం అనారోగ్యంతో మరణించడం జరిగిందిఇట్టి విషయం బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి శ్రీకాంత్ రెడ్డివారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు మృత్యునీ కుటుంబానికి 5000/- రూపాయలుఆర్థిక సహాయం పంపడం పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిర అశోక్ మరియు బి ఆర్ ఎస్,పార్టీ నాయకులు వార్డ్ మెంబర్స్ పెద్దోళ్ల లక్ష్మయ్య, మోముల జాన్ నాయకులు ఎకమామిడి గోపాల్, తలారి రమేష్, వన్మలి సుభాష్, చాపల నాగేష్,పుల్లయ్య వాండ్ల సురేష్, సిరిపురం శ్రీను, పెద్దోళ్ల ప్రభు, తలారి మల్లయ్య పెద్దోళ్ల పాండు తదితరులు మృత్యునీ కుటుంబం సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు

# పంచలింగాల్ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిద్దాం విద్యాధికారి బి అశోక్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ పాఠశాల సమావేశంలో పాల్గొన్న మర్పల్లి విద్యాధికారి బి అశోక్, పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులు తల్లిదండ్రులకు అభినయ సంబంధం ఉండాలి అప్పుడప్పుడు పాఠశాలను సందర్శించాలి నెలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశము ఏర్పాటు చేసుకోవాలి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవాలి అని మర్పల్లి విద్యాధికారి బి అశోక్ తెలిపారు, ప్రభుత్వ పాఠశాలలో మంచి తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను పంపుతున్నారు కేవలం ప్రభుత్వ పాఠశాల పై ఒక అపోహ అంతే తప్ప వేరొకటి లేదు ప్రైవేట్ పాఠశాలలో బస్సు ఎక్కడ టై బెల్టు కట్టుకోవడం బరువుకు మించిన లగేజ్ తప్ప తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు అసలే లేరు కాబట్టి తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి ఉపాధ్యాయులతో వారానికి ఒకసారి నెలకు ఒకసారి విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకోండి ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు చాలి చాలని నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులు ఎందరో ఉన్నారు కాయ కష్టం చేసి రోజువారి కూలి పనులు చేసి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నారు ప్రైవేట్ పాఠశాలలో చూడడానికి ఆహ్లాదకరంగా అందంగా కనిపిస్తుంది తప్ప విద్య బోధన సరిగ్గా లేదు కాబట్టి తల్లిదండ్రులు గమనించాలి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సరస్వతి నిలయం మన ప్రభుత్వ పాఠశాల మనలో ఉన్న అపోహలు తీసివేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించే బాధ్యత మీది సరైన బోధన విధానాన్ని బోధించి తరగతికి తగిన సామర్థ్యాలు అందించే బాధ్యత మాది అని మర్పల్లి విద్యాధికారి బి అశోక్ తెలిపారు పంచలింగాల్, నర్సాపూర్,గుండ్లమర్పల్లి,పిల్లిగుండ్ల, పాఠశాలలను సందర్శించడం జరిగిందని మర్పల్లి విద్యాధికారి బి అశోక్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు,పాఠశాల సమావేశంలో గ్రామ సర్పంచ్ బి మహేందర్, ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్,పాఠశాల చైర్మన్, వార్డు మెంబర్లు గ్రామ సంఘం లీడర్లు పేరెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్ బి శేఖర్,సి ఆర్ పి మల్లేశం సమావేశంలో పాల్గొన్నట్టు తెలిపారు

# మర్పల్లి జిపి నర్సరీని సందర్శించిన ఏపీవో అంజిరెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి జిపి నర్సరీని సందర్శించిన మర్పల్లి ఏపీవో అంజిరెడ్డి, నర్సరీలో మొక్కలు పెంచే విధానంలో కొన్ని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు తొలకరి వర్షాలు వచ్చేసరికి మొక్కలు దృఢంగా నాణ్యత కలిగి ఉండాలని తెలిపారు చెట్లు నాటడం ఎంత ముఖ్యమో చెట్లను బ్రతికించడం అంతే ప్రాముఖ్యమని ఏపీవో అంజిరెడ్డి తెలిపారు చెట్లు నాటే కార్యక్రమంలో కొందరు పాల్గొంటారు కానీ చెట్లను పెంచే బాధ్యత మనందరి పైన ఉంటుంది మనంఆశీదరం కృషి చేయాలని తెలిపారు గ్రామానికి వస్తుంటే గ్రామానికి రోడ్డుకు ఇరుపక్కల చల్లటి గాలి ఆరాధకరమైన వాతావరణంలో స్వచ్ఛమైన గాలి ప్రాణవాయువు నిచ్చే చెట్లు ఆహ్వానించి నట్టుగా గ్రామాలు ఉండాలి అని ఏపీవో అంజిరెడ్డి తెలిపారు

# జోగిపేటలో కాంట్రాక్టర్ ఇష్టఅనుసారంగా రోడ్డు విస్తరణ పనులు

### ఒకవైపు పని పూర్తికాకుండానే రెండోవైపు పనులు ప్రారంభం
### దీంతో ఒకే రహదారులో రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులు
### నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు విస్తరణ పనుల
### జాడలేని రోడ్లు భవనాల శాఖ అధికారులు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** జోగిపేట పట్టణంలో కోట్ల,రూపాయల నిధులతో రహదారుల విస్తరణ పనులు చేపడుతున్నారు, దీంతో పట్టణ ప్రజలతో పాటు, వాహనదారులకు ఇబ్బందులు,తప్పాయి అనుకుంటే, నాసిరకమైన పనులు చేయడంతో, అవే సమస్యలు ఎదురవుతున్నాయి, దీనికి నిదర్శనమే, జోగిపేట పట్టణంలో ఆందోల్, నుంచి అన్నాసాగర్,వరకు రోడ్డు విస్తరణతో పాటు, డివైడర్ నిర్మాణం కోసం, ప్రభుత్వం రెండు కోట్ల నిధులను మంజూరు చేసింది, పనులు మాత్రం సంగుపేట చౌరస్తా,( ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్.. జాతీయ రహదారి బైపాస్ రోడ్డు) నుంచి అన్న సాగర్ కట్టవరకు, ఈ పనులను చేపట్టేందుకు, టెండర్లు పిలిచారు, టెండర్లు దక్కించుకున్న, కాంట్రాక్టర్ స్థానికంగా ఉన్న సబ్ కాంట్రాక్టర్ కు, పనులు అప్పగించడంతో, ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు, ఎందుకంటే పూర్తిగా ఒకవైపు రోడ్డు విస్తరణ పనులు పూర్తి అయితే, రెండో వైపు నుంచి వాహనాలు వెళ్లే అవకాశం ఉంటుందని, ప్రధాన ఉద్దేశం, కానీ ఇక్కడ మాత్రం, ఒకవైపు రోడ్డు పనులు జరుగుతుండగానే, రెండో వైపున కూడా పనులు చేయడంతో, వాహనదారులు ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి, దీంతో రాత్రి వేళలో వాహనదారులు, అయోమయానికి గురై, ప్రమాదాలకు దారితీస్తున్న సందర్భాలు ఉన్నాయి, భారత్ పెట్రోల్ బంక్ నుంచి, అన్నా సాగర్, వైపు వెళ్లే ప్రధాన రహదారి వైపున, రోడ్డు విస్తరణ పనులు, ఒకవైపు పూర్తి కాకుండానే, డివైడర్ పనులు ప్రారంభించారు, అటు ఇటు కాకుండా, ఒకే వైపు రాకపోకలు కొనసాగిస్తుండడంతో, ప్రయాణికులు వాహనదారులు చాలా ఇబ్బంది పాలు అవుతున్నారు..

# మానవ హక్కుల కమిషన్ లో పిర్యాదు చేసిన ది సిటిజన్స్ కౌన్సిల్



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 11 మార్చి 2026**నిర్మాణాత్మక పౌర భాగస్వామ్యం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడం పై దృష్టి పెడుతు, సామాజిక రాజకీయ సంబంధాల స్థితి స్థాపక సమాజాన్ని నిర్మించడానికి అంకితమై, విధి విధానం నిర్వహించడానికి ఆవిర్భవించిన స్వచ్ఛంద సంస్థ ది సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యములో ఈ రోజు మానవ హక్కుల రక్షణ చట్టం, 1993 లోని సెక్షన్ 12 కింద తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ లో పిర్యాదు దాఖలు చేయడం జరిగినదని సంస్థ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు తెలియ పరచారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ డివిజన్ - 18 వారు ముందస్తు నోటీసు, విచారణ, పారదర్శక మీటర్ ధృవీకరణ లేదా స్పష్టమైన బిల్లింగ్ రికార్డులు లేకుండా దాదాపు ఐదు సంవత్సరాల కాలానికి పునరా వృత్త నీటి బిల్లు డిమాండ్లను మణికొండ, పుప్పాలగూడ మరియు నెక్నాంపూర్ నివాసితులకు జారీ చేసినట్లు, 2019 కి ముందు గ్రామ పంచాయతీ బల్క్ సరఫరా వ్యవస్థ కింద మంజూరు చేయబడ్డాయి మరియు సంబంధిత అధికారులు అనేక సంవత్సరాలుగా నివాసితులకు సాధారణ నెలవారీ లేదా ఆవర్తన బిల్లులు జారీ చేయలేదు. అయితే అక్టోబర్ 2025లో అకస్మాత్తుగా ఒకేసారి బకాయిలు చెల్లించాలని డిమాండ్లు రావడమూ వెను వెంటనే చెల్లింపు చేయకపోతే నీటి సరఫరాను నిలిపివేస్తామని, పునరావృత్త నీటి ఛార్జీలను కట్టమని ఏకపక్షంగా వత్తిడి చేయడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన జీవించే ప్రాథమిక హక్కులో తాగు నీటిని పొందే హక్కు కు భంగం కలిగిస్తున్నదని ఇట్టి రికవరీ పద్ధతి సహజ న్యాయం యొక్క సూత్రాలను ఉల్లంఘిస్తుందని, ఈ విషయాలన్ని గౌరవ కమిషన్ ముందు ఉంచడం, బలవంతపు రికవరీ చర్యలను నిరోధించడానికి మధ్యంతర ఉపశమనం ఇవ్వాలని కోరడములో బాగముగ ఐదు సంవత్సరాల బిల్లింగ్ రికార్డుల స్వతంత్ర ఆడిట్ చేయించాలని, ఏకపక్ష రికవరీ చర్యలను మానుకోవాలని, విచారణ సందర్భముగా నీటి సరఫరాను నిలిపివేయ వద్దని, సహేతుకమైన ప్రస్తుత నీటి వినియోగ ఛార్జీలను సంభావ్యంగా అంగీకరిస్థామని సంస్థ తమ పిర్యాదులో కోరడమైనది.ఖ

# కల్లుగీత కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఎక్సైజ్ సూపర్డెంట్ గారికి వినతి పత్రం అందచేత గౌడ సంఘం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి 11 03 2026** కన్నాయి గూడెం (ఏటూరునాగారం ): కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని 50 సంవత్సరాలు నిండిన వారికి కల్లు గీత వృత్తి పింఛన్ సైట్ ఓఫన్ చేసి తక్షణమే ఇవ్వాలని తాటి ఈత చెట్ల పెంపకం కోసం జీవో నంబర్ 560 ప్రకారం 10 ఎకరాలు భూమి ప్రభుత్వం కొని ఇవ్వాలని ఎన్నికలముందు గీత కార్మికుల కు ఇచ్చిన హామీలు హమలు చేయాలనీ ఇతర సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ కల్లు గీత కార్మిక సంఘం కన్నాయగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎటునాగారం ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన ఎక్సైజ్ సూపరెంట్ గారికి సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సంఘం మండలఅధ్యక్షులు పాలకుర్తి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మొదటిసారి కలిసిన సందర్భంగా సూపర్డెంట్ గారిని మరియు సిఐ ంఱ గారిని కలిసి ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. అనంతరం మండల కమిటీ అధ్యక్షులు పాలకుర్తి శ్రీధర్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు తాటి లచ్చలు గౌడ్ మాట్లాడుతూ కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తాటి యాదగిరి కార్యదర్శి పాలకుర్తి మధు గౌడ్.నవీన్ గౌడ్.కనకసేన గౌడ్. తడూరి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండ దెబ్బతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ ఇన్చార్జి మార్చి 11 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్ కొత్త ఫ్లాట్లకు చెందిన లకావత్ గణేష్ అనే 45 సంవత్సరాల ట్రాక్టర్ డ్రైవర్ వడదెబ్బతో మృతి చెందాడు.మృతునికి ముగ్గురు పిల్ల సంతానం మృతుడు ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తాడు.మృతుడు నిన్న మధ్యాహ్నం తన కొడుకు రాజేశ్వర్ ను ఎండదెబ్బ తగిలింది అని చెప్పి తంసప్ తాగేందుకు 200 రూపాయలు అడుక్కొని మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్ళాడు రాత్రి వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు.బుధవారం ఉదయం రోజున తన తండ్రి శవం మహానంద టాకీస్ వెనకాల ఇటికలచెరువు ఒడ్డున ఉందని స్థానికులు చెప్పడంతో వెళ్లి చూసరికి ఆయన మృతి చెంది ఉన్నాడు.వడదెబ్బ తగిలి బహిర్భూమికి వెళ్లి అక్కడే కుప్పకూలి చనిపోయాడని మృతుని కొడుకు లకావత్ రాజేశ్వర్ ఫిర్యాదు చేయడంతో గా ఎ ఎస్సై అన్వర్ హుస్సేన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది.

# మహిళా జన్ సున్వాయ్:
# ఫిర్యాదుల పరిశీలన – స్వీకరణ

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మార్చి 11:** 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని 2026 మార్చి8 నుండి 13 వరకు దేశవ్యాప్తంగా జాతీయ మహిళా కమిషన్ మరియు రాష్ట్ర మహిళా కమిషన్లు మహిళల సమస్యలను నేరుగా విని వారికి తక్షణ పరిష్కారం చూపేందుకు నిర్వహిస్తున్న మహిళా సున్వాయ్ లో భాగంగా మార్చి 12 గురువారం మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లాలోని మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ లో జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ శ్రీమతి విజయ రహత్కర్ అధ్యక్షతన “మహిళా సున్వాయ్” జరగనుంది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా మహిళల సమస్యల ఫిర్యాదులను పరిశీలిస్తారు మరియు వాక్ ఇన్ ఫిర్యాదులను స్వీకరిస్తారు. ఇట్టి సదా అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

# వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఎద్దడి కలగకుండా చూడాలి.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలి.

## నర్సరీలలో మొక్కల పెంపకం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

## జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి** ప్రజలకు వేసవికాలం దృష్ట్యా త్రాగు నీటి ఎద్దడి కలగకుండా చూడాలని, మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో వేగం పెంచేలా చర్యలు చర్యలు తీసుకోవాలని, నర్సరీ లలో మొక్కల పెంపకం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, సంపత్ రావు, డి ఆర్ డి ఓ, డి పి ఓ, ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఈ, హౌసింగ్ పి డి లతో కలిసి త్రాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు, నర్సరీల పెంపకం పై వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరు నాగారం మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, సంపత్ రావు, డి ఆర్ డి ఓ, డి పి ఓ, ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఈ లతో కలిసి త్రాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు, నర్సరీల పెంపకం పై తాడ్వాయి, గోవిందరావు పేట, వెంకటాపూర్, ములుగు, మల్లంపల్లి మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేరు వేరు గా సమీక్షించిన సందర్భాల్లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ



మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి అందుతున్నాయా లేదా అని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, చేతి పంపులు, పైప్‌లైన్ల మరమ్మతులను గుర్తించి వెంటనే పూర్తి చేయాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# భూదాన్ భూములను పేదలకు పంచాలి

## తెలంగాణ జన సమితి నేత గోపగాని శంకర్రావు డిమాండ్




**ఖమ్మం ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం)** నేలకొండపల్లి ఖమ్మం జిల్లాలోని వెలుగు మట్లలో భూదాన్ భూములపై పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసి తరువాత పట్టాలు ఇస్తామని చెప్పడం దారుణమని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు విమర్శించారు నేలకొండపల్లి భక్త రామదాసు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.భూదాన్ భూములుగా ఉన్న 62 ఎకరాల భూమి ప్రభుత్వానికి సంబంధించినది కాదని చట్టాలు, కోర్టులు చెబుతున్నప్పటికీ ఇళ్లను కూల్చడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రతి పేద కుటుంబానికి కనీసం 100 గజాల భూమి ఇవ్వాలని ముఖ్యమంత్రి మరియు కలెక్టర్లకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. 70 గజాల భూమిలో ఇల్లు నిర్మించుకోవడం ఎలా సాధ్యమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఆ 62 ఎకరాల భూమిని పేదలకు కేటాయించాలని, ప్రభుత్వ జోక్యం లేకుండా సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఉన్నట్టే ఖమ్మం జిల్లాలో కూడా హైడ్రా వ్యవస్థ రావాలని పేద ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అలాగే యూసీసీఆర్ఐఎంఎల్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వాస్తవాలను తెలుసుకోవడానికి సమగ్ర సర్వే నిర్వహించి మిగులు భూములను బయటకు తీయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు మండల నాయకులు మందడి వెంకటేశ్వరరావు వడ్లమూడి వెంకట్ రాములు నామరపు అచ్చయ్య, బస్వరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు




# రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది

## రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 11** : రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో గల పాత మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్,మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ,వైస్ చైర్ పర్సన్ నాయకపు వినయ్, డి సి సి ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి హాజరై మార్కెట్ కమిటీ చైర్మన్ గా మహేష్ ప్రసాద్ తివారి,వైస్ చైర్ పర్సన్ పాపిరెడ్డి,కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.రైతు రుణమాఫీ పథకంలో భాగంగా 2 లక్షల రూపాయల వరకు రుణం గల రాష్ట్రంలోని రైతుల ఖాతాలలో 23 వేల కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతు భరోసా పథకంలో భాగంగా 9 వేల కోట్ల రూపాయలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో రైతుల వద్ద నుండి అధిక మొత్తంలో పంట ఉత్పత్తులు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారెంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలుచేసి అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో బస్ డిపో ఏర్పాటులో భాగంగా భూ వివాదాన్ని త్వరగా పరిష్కరించి డిపో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, చెన్నూర్ నుండి హైదరాబాద్ కు ప్రస్తుతం నడిపిస్తున్న బస్సులకు అదనంగా మరొక బస్సు ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు.చెన్నూర్ నియోజకవర్గంలో నీటి పారుదల ప్రాజెక్టు ఏర్పాటు,ప్రజలందరికీ నిరంతరం త్రాగునీటి సరఫరా చేసే విధంగా చేపడుతున్న చర్యలలో భాగంగా అమృత్ పథకం అమలు చేస్తూ నీటి ట్యాంకులు,పైప్ లైన్ ల పనులు కొనసాగుతున్నాయని, తద్వారా ఇంటింటికి నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.వచ్చే వేసవిలో నీటి సమస్య లేకుండా 45 కోట్ల రూపాయల ప్రతిపాదనలతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.చెన్నూర్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా నుండి ట్యాంక్ బండ్ వరకు రహదారి విస్తరణ పనులు త్వరలోనే చేపడతామని, ఈ క్రమంలో వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో నగర అభివృద్ధి నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడతామని,చెన్నూర్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ ప్రతినిధులు రైతు సమస్యలపై నిరంతరం పర్యవేక్షిస్తూ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని,రైతులకు అవసరమైన పంట మెలకువలు, పంట మార్పిడి విధానం,వాణిజ్య పంటల సాగు,పంట ఉత్పత్తుల విక్రయం ఇతర అంశాలలో రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్,డైరెక్టర్లు,సభ్యులు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటూ రైతు సంక్షేమం దిశగా కృషి చేయాలని తెలిపారు.జిల్లాలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.వరి ధాన్యం,పత్తి ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ నిర్ణీత మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని,ఈ క్రమంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు చెన్నూర్ పట్టణంలోని ఎస్ ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరీక్ష పాడ్,పెన్నులను పంపిణీ చేసి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ మండలం పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించారు.గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి భోజనశాల, పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.9వ తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్

## మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గా కొండ ప్రవీణ్ కుమార్.




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 11 :** మంచిర్యాల జిల్లా ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్ ను నియమించడం జరిగింది.ఆంధ్రప్రదేశ్ లోని చీరాల లో అంబేద్కర్ భవన్ లో జరిగిన హ్యూమన్ రైట్స్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో హ్యూమన్ రైట్స్ కు సంబంధించిన విషయాలపై చర్చ వేదిక నిర్వహించారు అనంతరం కొంతమందికి పదోన్నతులు ఇవ్వడం జరిగింది అందులో భాగంగా హ్యూమన్ రైట్స్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీగా పవన్ కళ్యాణ్,కోఆర్డినేటర్ గా శశిధర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ గా శ్రీకాంత్,మంచిర్యాల జిల్లా ఉమెన్స్ వింగ్ సెక్రటరీగా మమతను నియమించడం జరిగింది.ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జనరల్ సోలమన్ రాజు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సంస్థ మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేసుకోకుండా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతూ,ప్రజల పక్షాన ప్రజల కోసం కృషి చేస్తామని తెలియజేశారు.

# ఈనెల 13న కామేపల్లి మండలంలో జరిగే పొంగులేటి పర్యటనలు

## జయప్రదం చేయండి మేకల మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం)** ఈనెల 13వ తేదీ శుక్రవారం నాడు కామేపల్లి మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం మరియు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం కు తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ,రెవిన్యూ, సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరియు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య విచ్చేయుచున్న సందర్భంగా పండితాపురం పశువుల సంత నుండి పొంగులేటి శ్రీనన్న వెంట భారీ ర్యాలీ కార్యక్రమం జరుగుతుందని, కావున పొంగులేటి అభిమానులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కామేపల్లి మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యంగా ఖమ్మం జిల్లా కు ఎక్కువ ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసిన నేపథ్యంలో దాదాపు ఇప్పటికే 70% పైగా ఇండ్ల నిర్మాణం పూర్తయిందని ఎక్కడ ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా బిల్లులు మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, నిర్వహిస్తున్న మంత్రివర్యులు పొంగులేటి శ్రీనన్నకు, ఇల్లందు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేకోరం కనకయ్యకు దక్కుతుందని మల్లి బాబు యాదవ్ అన్నారు ఈ కార్యక్రమంలో కొమనేపల్లి గ్రామ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, వార్డు మెంబర్లు ధరావతలాలు నాయక్ ఎస్.కె రబ్బానీ పాషా మండల కాంగ్రెస్ నాయకులు గుగులోతు రవి దేరంగుల తిరపయ్య మొగిలి శ్రీను మేకల లక్ష్మీనారాయణ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

# మహిళా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత

## రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద









**ధర్మ ఘంట మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 11 :** మహిళా సంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,మండల తహసిల్దార్ వనజా రెడ్డి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ,డిసిసి ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి గ్రామైఖ్య సంఘాల భవనాలకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...ప్రభుత్వం మహిళల సంక్షేమం,అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ క్రమంలో 30 లక్షల రూపాయల వ్యయంతో 3 గ్రామైఖ్య సంఘాల భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో 3 కోట్ల 50 లక్షల రూపాయలతో 35 భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్,పెట్రోల్ బంకుల నిర్వహణతో పాటు ఇందిరా శక్తి క్యాంటీన్లు,పెరటి కోళ్ల పెంపకం, ఇతర అనేక వ్యాపారాలలో ప్రోత్సహిస్తూ మహిళలను ముందంజలో ఉంచే విధంగా కృషి చేస్తుందని తెలిపారు.మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించి,బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు.రుణం పొందిన స్వయం సహాయక సంఘాలు సకాలంలో చెల్లించి తిరిగిరుణం పొంది తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. మహిళలు తాము చేపట్టిన వ్యాపారాలను క్రమ పద్ధతిలో నిర్వహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రాయితీ గ్యాస్ సిలిండర్,గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్,ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.జైపూర్ మండలానికి 753 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 200 ఇండ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నాయని,ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాని అర్హులైన లబ్ధిదారులకు వచ్చే విడతలో అందించడం జరుగుతుందని తెలిపారు. 15 సంవత్సరాల వయసు కలిగిన బాలికలకు ప్రభుత్వం హెచ్ పి వి వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తుందని, భవిష్యత్తులో క్యాన్సర్ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జైపూర్ మండలంలో చేపట్టిన 1 వెయ్యి 250 మెగా వాట్ల పవర్ ప్లాంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ప్లాంట్ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోయిన పట్టాదారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా దాదాపు 13 వేల కోట్ల రూపాయలతో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ప్రజలతో చెన్నూర్ నుండి హైదరాబాద్ వరకు బస్సు సర్వీసులను నిర్వహించడం జరుగుతుందని,అదనంగా మరొక బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని,ప్రజా సంక్షేమంలో భాగంగా గ్యారంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారిశుధ్యం,ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న పైళ్ల క్లియరెన్స్,ఆరోగ్యం, అరైవ్ అలైవ్,సంక్షేమం,పిల్లల భద్రత,వ్యవసాయం,విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి జిల్లాలోని గ్రామపంచాయతీల సర్పంచ్ లు,మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపల్ కార్పొరేటర్లు /కౌన్సిలర్లకు జిల్లా కేంద్రాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండలంలోని 39 మంది కళ్యాణలక్ష్మి /షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.నిరుపేద ఆడపడుచులకు వివాహానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని,మండలంలో ఇప్పటివరకు 375 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా అదనపు ఆదాయం పొందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలలో కార్యాలయ భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళా సమాఖ్య భవనాల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చర్యలు చేపట్టడం జరుగుతుందని,అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేయడం జరిగిందని,తద్వారా ప్రభుత్వ పాఠశాలలను 3 శాతం విద్యార్థుల సంఖ్య పెంపొందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామైఖ్య సంఘాల మహిళలు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కళలకు గుర్తింపు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ -- కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మార్చి 11:** విద్యార్థులలోని కళలు మరుగున పడకుండా సరైన గుర్తింపు పొందేలా వెబ్ సైట్ క్రియేట్ చేసి అందులో అప్ లోడ్ చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు.

బుధవారం ఘట్కేసర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వసతి గృహంలో అందుతున్న బోధన పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూచిపూడి, గిటారు, కీబోర్డు, పెయింటింగ్ వంటి విభాగాలను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. సర్టిఫికెట్ కోర్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ ను పరిశీలించి, ఒక కొత్త వెబ్ సైట్ ను క్రియేట్ చేసి అందులో విద్యార్థుల పెయింటింగ్స్ ను అందుబాటులో ఉంచితే, ఆసక్తి గలవారు ఆర్డర్స్ ఇస్తారని అన్నారు. మ్యూజిక్ ఇన్ స్ట్రుమెంట్స్ నేర్చుకున్నవారితో ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలన్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ వారికి ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని, ఏమైనా కావాలా అని అడుగగా, విద్యార్థినులు ఆడుకోవడానికి ఫుట్ బాల్, చెస్, వాలీబాల్, అలాగే ఆర్ట్స్ కు కావలసిన ఎక్విప్ మెంట్ కావాలని కోరారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ అవసరమైనవి తప్పకుండా అందిస్తానని అన్నారు. స్కూల్ యాజమాన్యం వారు అవసరమైన వాటి కోసం, అలాగే విద్యార్థులు అడిగిన ఆట వస్తువుల ను కలుపుకొని ప్రతిపాదనలు తనకు పంపాలని సూచించారు. స్టోర్ రూం ను పరిశీలించి ఎక్స్పైరీ డేట్ చెక్ చెస్తూ అంతలోపే వంట సామాగ్రిని వాడుకోవాలని, నాణ్యత గల వస్తువులనే వాడాలని సూచించారు.



## పట్లూర్ బాలుర వసతి గృహంలో టెన్త్ క్లాస్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వార్డెన్ తుల్జారాం గౌడ్




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 11(ప్రజాబలం)** వికారాబాద్:మర్పల్లి మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహం పట్లూరులో బుధవారం 11.03.2026. నా పదో తరగతి విద్యార్థులకు వీడుకోలు సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో హాస్టల్ సంక్షేమ అధికారి తుల్జారామ్ గౌడ్ వికారాబాద్ జిల్లా పి ఆర్ టి యు అసోసియేట్ అధ్యక్షులు పి లాలయ్య మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు పదవ తరగతి ఉత్తీర్ణతపైనే ఉంటుందని విద్యార్థులందరూ తమ బంగారు భవిష్యత్తును తీర్చదిద్దుకోవడానికి ఈ పదవ తరగతి కీలకమని వారు అన్నారు విద్యార్థులు పరీక్షా సమయంలో అత్యంత దృష్టి సాధించాలని సూచించారు ఎన్నో సంవత్సరాల నుండి ఒకే హాస్టల్లో చదువుకొని ఒకే పాఠశాలలో చదువుకొని ఈరోజు టెన్త్ క్లాస్ విద్యార్థులకు వీడుకోలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది టెన్త్ క్లాస్ అన్న వాళ్ళు వెళ్లిపోవడం చాలా బాధాకరంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తపరిచారు మరియు టెన్త్ క్లాస్ అన్నలు మంచి ఎగ్జామ్ రాసి పాఠశాలకు వసతి గృహం వార్డెన్ కి మంచి పేరు తీసుకురావాలని అన్నవాళ్ళు పై చదువులకు వెళ్లడం ఒకరకంగా సంతోషంగా ఉందని విద్యార్థులు తెలిపారు విద్యార్థులు ఎంతో క్రమశిక్షణగా అణుకువగా విద్యాభ్యాసం చేసి వసతి గృహంలో మాతో కలిసి ఉండి ఈరోజు వారు పై చదువుల నిమిత్తం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు చేయడం ఒకరకంగా సంతోషంగా ఉంది విద్యార్థులు వెళ్లిపోతున్నారని బాధగా ఉందని హాస్టల్ సంక్షేమ అధికారి తుల్జారాం గౌడ్, ఆవేదన వ్యక్తపరిచారు ఏది ఏమైనా మంచి విద్యను అభ్యసించి ఉన్నతమైన స్థానాలను లక్ష్యసాధనలో మీరు సాధించాలని టీచర్లుగా డాక్టర్లుగా అధికారులుగా అనేక రంగాల్లో మంచి విద్యను అభ్యసించి ఉన్నతమైన స్థితిలో విద్యార్థులు ఉండాలని హాస్టల్ వసతి గృహం తుల్జారాంగౌడ్ తెలిపారు వీడ్కోలు సమావేశంలో జిల్లా పిఆర్టియు అసోసియేషన్ జిల్లాఅధ్యక్షులు లాలయ్య, వసతి గృహం వార్డెన్ తుల్జారామ్ గౌడ్, విద్యార్థులు వసతి గృహ నిర్వాహకులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు



## టేక్మాల్ జాతరలో హోరాహోరీగా కుస్తీపోటీలు





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 11 (ప్రజాబలం,)** సంగాడ్డిజిల్లా: టేక్మాల్ మండల కేంద్రంలో, దుర్గమ్మ పోచమ్మ జాతర సందర్భంగా, కుస్తీ పోటీలను నిర్వహించారు, ప్రతిఏటా హోలీ పండుగ తరువాత, 5వ రోజు నుంచి ఐదు రోజులపాటు, ఈ కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న పద్ధతి, టేక్మాల్ మండల కేంద్రంలో, శ్రీ దుర్గమ్మ పోచమ్మ జాతర సందర్భంగా, టేక్మాల్ సర్పంచ్ సుధాకర్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో, నిర్వహించిన కుస్తీ, పోటీలలో పాల్గొని విజేతగా నిలిచిన వారికి, టేక్మాల్ సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో విజేతకు బహుమతి అందజేస్తున్న, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధనుంజయ, మాజీ అధ్యక్షుడు బాగయ్య, నరేందర్, లక్ష్మణ్, దుర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ ఏజెంట్ల మోసానికి బలైన నూకలమర్రి యువకుడు అరెస్టు చేసి రిమాండ్ కు తరలింపు




**ప్రజాబలం ప్రతినిధి (వేములవాడ మార్చి -11)** వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన గుగులోతు రవినీ జగిత్యాల జిల్లాకు చెందిన శ్రీకృష్ణ ట్రావెల్స్ దండుగుల మల్లేశం పల్లపు నాంపల్లి అనే ఇద్దరు వ్యక్తులు అల్మీరీయా అనే దేశం పంపిస్తానని రవి వద్ద నుండి మూడు లక్షల రూపాయలు తీసుకొని పంపగా అతనికి మాట ఇచ్చిన ప్రకారం కోరిన పనిలో కాకుండా వేరే పనిలో పెట్టడం జరిగిందని అతను ఇండియాకు వచ్చి వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా మోసం చేసిన ఇద్దరు ఏజెంట్ల పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామని రూరల్ ఎస్ ఐ వెంకట్రాజం తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com